ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

# ప్రజా కలం

Published From Nizamabad

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

PRGI No.TELTEL/2010/33275



ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



శుక్రవారం | 17-04- 2026 సంపుటి: 17, సంచిక: 15, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆


### మహిళా రిజర్వేషన్ బిల్లు దేశ చరిత్రలో

# కీలక మలుపు

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు చారిత్రక మైలురాయి



- వికసిత్ భారత్‌కు మహిళల భాగస్వామ్యం కీలకం
- 30 ఏళ్ల ఆలస్యంపై గత ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు
- విపక్షాల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రధాని
- "మహిళా లోకం క్షమించదు" అంటూ హెచ్చరిక
- చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంపుపై దృఢ సంకల్పం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 :

లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం దేశవ్యాప్తంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ బిల్లును దేశ చరిత్రలో ఒక కీలక మలుపుగా అభివర్ణించిన ఆయన, మహిళలకు రాజకీయ అధికారాన్ని కల్పించడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. "వికసిత్ భారత్" లక్ష్యాన్ని చేరుకోవాలంటే మహిళల భాగస్వామ్యం తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. ప్రసంగంలో భాగంగా, మహిళా రిజర్వేషన్ బిల్లుపై గతంలో జరిగిన ఆలస్యాన్ని తీవ్రంగా విమర్శించిన ప్రధాని, ఇది దాదాపు మూడు దశాబ్దాల క్రితమే అమల్లోకి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. గత ప్రభుత్వాలు దీన్ని పట్టించుకోకపోవడం వల్ల మహిళలు రాజకీయ అవకాశాలను కోల్పోయారని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకునే సమయం వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. మహిళల సామర్థ్యాన్ని వివరించిన ప్రధాని, వారు ఇప్పటికే విద్య, వైద్యం, సాంకేతిక రంగాలు, వ్యాపారం, క్రీడలు వంటి అనేక రంగాల్లో విశేష ప్రతిభ చూపుతున్నారని గుర్తుచేశారు. గ్రామ స్థాయి పంచాయతీల్లో మహిళా రిజర్వేషన్లు విజయవంతంగా అమలవుతున్నాయని, దీని వల్ల మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెరిగాయని అన్నారు. అదే విధంగా పార్లమెంట్ మరియు అసెంబ్లీల్లో కూడా మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తే దేశ పాలనలో సానుకూల మార్పులు వస్తాయని అభిప్రాయపడ్డారు. విపక్షాల వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రధాని, కొందరు నేతలు తమ రాజకీయ భవిష్యత్తుపై భయంతోనే ఈ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌కు అడ్డుపడే వారిని ప్రజలు, ముఖ్యంగా మహిళలు క్షమించరని ఘాటుగా హెచ్చరించారు.

తరువాయి 2వ పేజీలో...



### తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా

# ప్రోత్సహించండి

### ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో రాష్ట్రం 'అవకాశాల ఖని
### ఏటా వృద్ధి రేటు 30 శాతం, ఎగుమతుల్లో 103 శాతం నమోదు
### యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రజాకలం) :

ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని, ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్ కమ్యూనికేషన్స్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో గురువారం 'యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' బృంద సభ్యులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో తెలంగాణలో ఉన్న అవకాశాలు, ఇక్కడి అనుకూలతలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాలసీలు మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు... అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగం(ఏరోస్పేస్; డిఫెన్స్, స్పేస్)లో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు.

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




# సీఎం మౌనం ఎందుకు?

### 10% మంత్రి అవినీతి పై మోత్కుపల్లి ఫైర్

- అవినీతి మంత్రిపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్న
- 10 పర్సెంట్ మంత్రిగా ప్రజల్లో చర్చనీయాంశం
- సీఎం ఒక్కడి కృషితో సరిపోదన్న మాజీ మంత్రి
- ప్రభుత్వంలో అంతర్గత కుట్రలు జరుగుతున్నాయన్న ఆరోపణ
- 'నల్లికుట్లోళ్లు'పై సీఎం మౌనం పై విమర్శ
- ఎస్సీ వర్గీకరణ తర్వాత కూడా అసంతృప్తి కొనసాగుతోంది
- అవినీతి నిర్మూలనకే ప్రజల మద్దతు వస్తుందన్న హెచ్చరిక



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రజాకలం):

తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ అవినీతి ఆరోపణలు హాట్ టాపిక్‌గా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనితీరు, ఆయన మంత్రివర్గంపై వస్తున్న ఆరోపణలపై మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుతీవ్రస్థాయిలో స్పందించారు.

తరువాయి 2వ పేజీలో...

# తెలంగాణపై విషం

### తేజస్వి సూర్య వ్యాఖ్యలపై కేటీఆర్ ఆగ్రహం

- తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చడంపై తీవ్ర ఖండన
- బీజేపీ, కాంగ్రెస్ వైఖరిపై బీఆర్ఎస్ విమర్శలు
- పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీల మౌనం సిగ్గుచేటు
- తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తున్నారని మండిపాటు
- సర్ లో అక్రమాలపై పార్టీ శ్రేణులకు అప్రమత్తత సూచన
- ప్రతి బూత్‌లో ఓటు రక్షణకు కేటీఆర్ పిలుపు
- దొంగ ఓట్ల నమోదుపై హెచ్చరిక
- బూత్ లెవల్ ఏజెంట్ల నియామకానికి మార్గదర్శకాలు
- ప్రజాస్వామ్య హక్కుల రక్షణలో ముందుండాలని హితవు



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రజాకలం) :

తెలంగాణ రాష్ట్ర అస్తిత్వంపై అవమానకర వ్యాఖ్యలు చేయడమే కాకుండా, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలకు పాల్పడే అవకాశాలపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

2లో...

### రాహుల్‌ను మించిపోయిన

# రేవంత్


### కాంగ్రెస్ ఎంపీలకు ఆయనే డైరక్షన్ ఇస్తున్నారు బీఆర్ఎస్‌తోపొత్తు ప్రసక్తే లేదు: రాంచందర్‌రావు



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రజాకలం) :

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని మించిపోయారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. గురువారం పార్లమెంట్ గ్యాలరీలో కూడా కూర్చొన్న రేవంత్.. రాహుల్ గాంధీని మాట్లాడనియ్యలేదని, కాంగ్రెస్ ఎంపీలకు కూడా దిశానిర్దేశం చేస్తున్నారని విమర్శించారు.

తరువాయి 2వ పేజీలో...



### మోనాలిసా

# వివాదం!

- కేరళ సీఎంకు రక్షణ కోరుతూ యువతి లేఖ
- తాను మేజర్‌నని మోనాలిసా స్పష్టీకరణ
- తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు
- మధ్యప్రదేశ్ పోలీసుల విచారణ వేగం
- కొచ్చికి చేరుకున్న దర్యాప్తు బృందం

2లో

# సీట్ల పెంపు... న్యాయం ఎక్కడ?

### లోక్‌సభ సీట్ల పెంపు అవసరమేనని మల్లన్న వ్యాఖ్య

- జనాభా ఒక్కటే ప్రమాణం అయితే అన్యాయం జరుగుతుందన్న హెచ్చరిక
- కుటుంబ నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు నష్టం జరిగే ప్రమాదం
- అభివృద్ధి సూచికల ఆధారంగా సీట్ల పంపకానికి డిమాండ్
- దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలకు మద్దతు
- "రివార్డ్ ఫార్ములా" ప్రవేశపెట్టాలని సూచన
- సమాన న్యాయం లేకపోతే దేశ ఐక్యత దెబ్బతింటుందన్న అభిప్రాయం



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రజాకలం):

లోక్‌సభ సీట్ల పెంపు అవసరం ఉన్నప్పటికీ, జనాభా అనే ఒక్క ప్రమాణంతో సీట్లను పంచడం దేశానికి ప్రమాదకరమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పష్టం చేశారు. ప్రస్తుతం 140 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశానికి 543 మంది సభ్యులతో కొనసాగడం కష్టమని, అందువల్ల సీట్ల పెంపు ఆలోచన సరైనదేనని ఆయన పేర్కొన్నారు. అయితే ఆ పెంపు విధానం సరైన మార్గంలో లేకపోతే దేశంలో ప్రాంతీయ అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

జనాభా ఆధారంగా మాత్రమే సీట్ల పంపకం జరిగితే, గత కొన్ని దశాబ్దాలుగా కుటుంబ నియంత్రణ, మహిళా విద్య, ఆరోగ్య రంగాలలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు రాజకీయంగా బలహీనపడే పరిస్థితి వస్తుందని మల్లన్న ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి సాధించిన రాష్ట్రాలకు బహుమతి ఇవ్వాల్సిన చోట శిక్ష విధించినట్లవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. దక్షిణాది రాష్ట్రాలు చాలా కాలంగా వ్యక్తం చేస్తున్న ఈ ఆందోళనను కేంద్రం గంభీరంగా పరిగణించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశ ప్రయోజనాల కోసం జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించడం న్యాయం కాదని స్పష్టం చేశారు. లోక్‌సభ సీట్ల పెంపు జరిగితే అది కేవలం జనాభాపైనే కాకుండా,

తరువాయి 2వ పేజీలో...

### ప్రజాపాలన సభలో ఉన్నతధికారి ఫోన్‌కే

# ప్రాధాన్యం!

- ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఎమ్‌పీడీవో నిర్లక్ష్యం
- ప్రజల్లో ఆగ్రహం,వివిధ అధికారుల చర్చ?



2లో

# నూతన దిశ

మొదటి పేజీ తరువాయి...

"మహిళా లోకం క్షమించదు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశంగా మారాయి. ఈ బిల్లును రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా, దేశ ప్రజల శ్రేయస్సు కోసం తీసుకువచ్చామని ప్రధాని స్పష్టం చేశారు. మహిళలకు అధికారం ఇస్తే వారు సమాజంలో సమానత్వాన్ని తీసుకువస్తారని, కొత్త ఆలోచనలతో పాలనలో పారదర్శకత పెంచుతారని అన్నారు. మహిళల నాయకత్వం దేశ అభివృద్ధికి కొత్త దిశను నిర్దేశిస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. అదే సమయంలో, మహిళా శక్తిని తక్కువ అంచనా వేయవద్దని ప్రధాని సూచించారు. మహిళలు తమకు లభించే అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకుని చట్టసభల్లో సత్తా చాటుతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ బిల్లు అమలులోకి వస్తే, భారత రాజకీయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుందని, దీని ద్వారా సమాజంలో సమాన హక్కులు బలపడతాయని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి, మహిళలకు రాజకీయ అధికారం కల్పించడం ద్వారా దేశాన్ని అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు నడిపించవచ్చని ప్రధాని స్పష్టం చేశారు. ఈ బిల్లుతో భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని, మహిళలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# తెలంగాణపై విషం

మొదటి పేజీ తరువాయి...

ఒకవైపు పార్లమెంట్ వేదికగా తెలంగాణను కించపరిచే వ్యాఖ్యలు, మరోవైపు ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని కేటీఆర్ హెచ్చరించారు. పార్లమెంట్‌లో తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఇది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించే చర్య అని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు సాగిన ఉద్యమం, వేలాది మంది అమర వీరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆయన గుర్తు చేశారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణపై విషం చిమ్ముతున్నారని, నరేంద్ర మోదీ నుంచి ప్రారంభమై పలువురు నేతలు తెలంగాణ వ్యతిరేక ధోరణిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని కేటీఆర్ హెచ్చరించారు. పార్లమెంట్‌లో తెలంగాణపై విమర్శలు జరుగుతున్న సమయంలో అక్కడే ఉన్న తెలంగాణ ఎంపీలు మౌనం వహించడం అత్యంత సిగ్గుచేటని ఆయన దుయ్యబట్టారు. బీజేపీతో పాటు కాంగ్రెస్ ఎంపీలు కూడా స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర గౌరవాన్ని కాపాడటంలో విఫలమైన ఈ నాయకులు ప్రజలకు ఎలా సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, అలాగే బీజేపీ పార్టీ కూడా అధికారికంగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేదంటే ఈ వ్యాఖ్యలనే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (Special Intensive Revision - SIR) ప్రక్రియపై కూడా కేటీఆర్ పార్టీ శ్రేణులకు కీలక సూచనలు చేశారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన ఆయన, ఈ కార్యక్రమాన్ని అడ్డం పెట్టుకుని అధికార కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అక్రమాలకు పాల్పడే ప్రమాదం ఉన్నదని తెలిపారు. దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రతిపక్ష ఓట్లను తొలగించిన ఘటనలను గుర్తు చేస్తూ, ఇటీవల జరిగిన ఎన్నికల్లో దొంగ ఓట్ల నమోదుపై వచ్చిన ఆరోపణలను ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రతి బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాను కచ్చితంగా పర్యవేక్షించాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి, వారు బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, అనర్హుల తొలగింపు, ఓటర్ల జాబితాలోని తప్పుల సవరణ వంటి అంశాల్లో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడిని ఓటరుగా నమోదు చేయించడం పార్టీ శ్రేణుల బాధ్యతగా పేర్కొన్నారు.

త్వరలో ప్రారంభమయ్యే సర్ ప్రక్రియ తక్కువ సమయంలోనే పూర్తయ్యే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలని, ప్రతి ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ బూత్ స్థాయి నుంచి సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కేటీఆర్ సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమని, దాన్ని కాపాడటమే ప్రతి ఒక్కరి బాధ్యత అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ గౌరవాన్ని కాపాడటంతో పాటు ప్రజల ఓటు హక్కును రక్షించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు కట్టుబడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# సీఎం మౌనం ఎందుకు?

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రంలో ఒక మంత్రికి '10 పర్సెంట్ మంత్రి' అనే పేరు బహిరంగంగా ప్రచారంలో ఉందని, ప్రజల్లో ఈ అంశం విస్తృతంగా చర్చనీయాంశమైందని ఆయన పేర్కొన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు అదే విషయాన్ని ప్రస్తావిస్తున్నారని, ఇది ప్రభుత్వ ప్రతిష్టకు పెద్ద దెబ్బ అని మోత్కుపల్లి అభిప్రాయపడ్డారు. ఇంత స్పష్టంగా అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, సంబంధిత మంత్రిపై చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణం ఏమిటని సీఎం రేవంత్ రెడ్డిని నేరుగా ప్రశ్నించారు. అవినీతి ఎవరైనా చేసినా కఠిన చర్యలు తప్పవని, కులం, వర్గం అనే తేడా లేకుండా బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో బాధ్యతాయుత వ్యవహారం లేకపోతే ప్రజల్లో నమ్మకం కోల్పోతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఒక్కడే కష్టపడితే ప్రభుత్వ యంత్రాంగం సక్రమంగా నడవదని, ఆయనతో పాటు మొత్తం మంత్రివర్గం సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం వెనుక ఉండి గోతులు తవ్వే వ్యక్తులు ('నల్లికుట్లోళ్లు') ఎవరనే విషయం ఆయనకు తెలియదా? అని ప్రశ్నిస్తూ, ప్రభుత్వం లోపలే కుట్రలు జరుగుతున్నాయనే అనుమానాలను వ్యక్తం చేశారు. ఇక రేవంత్ ప్రభుత్వం అంతర్గత విభేదాలతో బలహీనపడుతోందని, సొంత పార్టీలోనే అసంతృప్తి పెరుగుతోందని మోత్కుపల్లి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం కూలిపోవడానికి సిద్ధంగా ఉందన్న ఆయన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ఎస్సీ వర్గీకరణ వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, వాటిపై వ్యతిరేక స్వరాలు వినిపిస్తున్నాయని, కొందరు బహిరంగంగా సమావేశాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం సమర్థవంతంగా స్పందించలేకపోతుందని విమర్శించారు. ఇది ప్రభుత్వ బలహీనతకు నిదర్శనమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కేవలం తన పదవిని కాపాడుకోవడంపైనే దృష్టి పెట్టారని, ప్రజల సమస్యలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలు ప్రాధాన్యత కోల్పోతున్నాయని ఆరోపించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే ముందుగా అవినీతి నిర్మూలనపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పనిచేస్తేనే ప్రజలు మద్దతుగా నిలుస్తారని, లేదంటే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశముందని మోత్కుపల్లి హెచ్చరించారు.

# మోనాలిసా వివాదం!

## కేరళ సీఎంకు రక్షణ కోరుతూ యువతి లేఖ



- తాను మేజర్‌నని మోనాలిసా స్పష్టీకరణ
- తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు
- మధ్యప్రదేశ్ పోలీసుల విచారణ వేగం
- కొచ్చికి చేరుకున్న దర్యాప్తు బృందం
- వయస్సు వివాదంతో కేసు సంక్లిష్టత

కొచ్చి, ఏప్రిల్ 16; 'కుంభమేళా వైరల్ స్టార్'గా గుర్తింపు పొందిన మోనాలిసా భోస్లే వ్యవహారం గురువారం కొత్త మలుపు తిరిగింది. మధ్యప్రదేశ్ పోలీసులు తనను బలవంతంగా సొంతూరికి తీసుకెళ్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ, రక్షణ కల్పించాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు, కొచ్చి నగర పోలీస్ కమిషనర్‌కు మోనాలిసా లేఖ రాసింది. ఆ లేఖలో తాను 18 ఏళ్లు నిండిన మేజర్‌నని స్పష్టం చేసింది. ఇదే సమయంలో, ఆమె భర్త ఫర్మాన్ ఖాన్‌తో కలిసి నమోదైన పోక్సో కేసు విచారణ కోసం మధ్యప్రదేశ్ పోలీసు బృందం కొచ్చికి చేరుకుంది. తిరువనంతపురం సమీపంలోని ఆలయంలో మార్చి 11న జరిగిన వారి వివాహ సమయంలో మోనాలిసా మైనర్ అని జాతీయ గిరిజన కమిషన్ ప్రాథమిక విచారణలో తేలడంతో ఈ కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. అయితే, ఈ కేసులో ఫర్మాన్ ఖాన్‌కు కేరళ హైకోర్టు మే 20 వరకు అరెస్ట్ నుంచి ఉపశమనం కల్పించింది. మరోవైపు, మోనాలిసా తల్లి లతా భోస్లే తన కుమార్తె 2009 డిసెంబర్‌లో జన్మించిందని, పెళ్లి సమయంలో ఆమె వయసు 16 ఏళ్లు మాత్రమేనని ఆరోపిస్తోంది. సినిమా అవకాశాల పేరుతో మోసపూరితంగా తీసుకెళ్లి వివాహం జరిపించారని, ఇందుకోసం నకిలీ జనన ధృవీకరణ పత్రం సృష్టించారని ఆమె ఆరోపించింది. ఆసుపత్రి రికార్డులు కూడా ఇదే విషయాన్ని సూచిస్తున్నాయని పేర్కొంది. ఈ ఘటన కేరళలో రాజకీయ దుమారం రేపుతోంది. అధికార సీపీఎం అండతోనే ఈ వివాహం జరిగిందని రాష్ట్ర బీజేపీ నేతలు ఆరోపిస్తుండగా, ఆ ఆరోపణలను సీపీఎం ఖండించింది. తాము పెళ్లి నిర్వహించలేదని, విషయం తెలిసిన తర్వాత మాత్రమే హాజరయ్యామని వివరణ ఇచ్చింది. ప్రస్తుతం ఈ కేసుపై గిరిజన కమిషన్ దృష్టి సారించి, కేరళ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల సీనియర్ పోలీసు అధికారులను ఢిల్లీకి విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఒకవైపు తాను మేజర్‌నని మోనాలిసా చెబుతుండగా, మరోవైపు ఆమె కుటుంబం, పోలీసులు మైనర్ అని వాదించడం వల్ల ఈ వ్యవహారం చట్టపరంగా, రాజకీయంగా మరింత సంక్లిష్టంగా మారింది.

# డీలిమిటేషన్ కుట్ర



హైదరాబాద్, ఏప్రిల్ 16 (ప్రజాకలం) : మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను లింక్ చేయడం వెనుక పెద్ద కుట్ర ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచే లక్ష్యంతో తీసుకువచ్చిన మహిళా బిల్లును, డీలిమిటేషన్ ప్రక్రియతో అనుసంధానం చేయడం సరైంది కాదని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళల హక్కులను ముందుకు తెచ్చే పేరుతో, వాస్తవానికి డీలిమిటేషన్ బిల్లును అమలు చేయడానికి వారి భుజాలపై తుపాకీ పెట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ ప్రక్రియ వల్లముఖ్యంగా తెలంగాణరాష్ట్రానికి నష్టం జరిగే ప్రమాదం ఉందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణకు ఉన్న సుమారు 3.13 శాతం ప్రాతినిధ్యం, భవిష్యత్తులో తగ్గిపోతే అది రాష్ట్రానికి అన్యాయం అవుతుందని హెచ్చరించారు. దేశంలో జనాభా ఆధారంగా స్థానాల పునర్విభజన జరిగితే, తెలంగాణ రాజకీయ ప్రాధాన్యం దెబ్బతినే అవకాశం ఉందని ఆమె తెలిపారు. తెలంగాణకు ఉన్న ప్రాతినిధ్యం ఏ విధంగానూ తగ్గకూడదని, అదే స్థాయిలో కొనసాగాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం దెబ్బతింటుందని, అవసరమైతే మరోసారి తెలంగాణ ఉద్యమం కూడా తప్పదని కవిత స్పష్టం చేశారు. అదేవిధంగా, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ వర్గాలకు ప్రత్యేక సబ్‌కోటా తప్పనిసరిగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. అన్ని వర్గాల మహిళలకుసమాన న్యాయం జరిగేలా చట్టం రూపుదిద్దుకోవాలని, సామాజిక న్యాయం పరిరక్షించబడాలని ఆమె అభిప్రాయపడ్డారు. మొత్తంగా మహిళా బిల్లును రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకుండా, నిజంగా మహిళల సాధికారతను దృష్టిలో పెట్టుకుని అమలు చేయాలని కవిత కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

> మహిళా బిల్లుతో డీలిమిటేషన్ లింక్‌పై కవిత ఆగ్రహం
>
> మహిళల పేరుతో రాజకీయ అజెండా నడుపుతున్నారన్న విమర్శ
>
> తెలంగాణ ప్రాతినిధ్యం తగ్గితే తీవ్ర పరిణామాల హెచ్చరిక
>
> 3.13% స్థానాలు యథాతథంగా ఉండాలన్న డిమాండ్
>
> మహిళా బిల్లులో బీసీ సబ్‌కోటా తప్పనిసరి అని స్పష్టం

# సీట్ల పెంపు... న్యాయం ఎక్కడ?

మొదటి పేజీ తరువాయి...

రాష్ట్రాల సామాజిక–ఆర్థిక అభివృద్ధిని కూడా పరిగణలోకి తీసుకునే విధంగా ఉండాలని మల్లన్న సూచించారు. మానవ అభివృద్ధి సూచికలు, అక్షరాస్యత, ఆరోగ్య సేవలు, పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల ఆధారంగా సీట్లను పంచాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో "రివార్డ్ ఫార్ములా"ను అమలు చేయాలని ఆయన ప్రతిపాదించారు. అంటే, కొత్తగా పెంచే సీట్లలో ఒక భాగాన్ని జనాభాకు, మరొక భాగాన్ని అన్ని రాష్ట్రాలకు సమానంగా, మిగతా భాగాన్ని అభివృద్ధి ప్రమాణాల ఆధారంగా కేటాయించాలన్నారు. జనాభా ఒక్కటే ప్రమాణంగా మారితే రాజకీయ పార్టీల దృష్టి కూడా అభివృద్ధి నుండి జనసంఖ్య పెంపు వైపు మళ్లే ప్రమాదం ఉందని మల్లన్న హెచ్చరించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందని, దేశ సమాఖ్య స్వభావానికి విరుద్ధమని తెలిపారు. లోక్‌సభ సీట్ల పెంపు దేశాన్ని కలపడానికి ఉపయోగపడాలే గాని, ప్రాంతాల మధ్య విభేదాలను పెంచకూడదని ఆయన పేర్కొన్నారు. సమాన న్యాయం, అభివృద్ధికి గౌరవం, రాష్ట్రాల ప్రాతినిధ్యానికి సమతౌల్యం కలిగిన విధానం ద్వారానే నిజమైన ప్రజాస్వామ్యం బలపడుతుందని మల్లన్న స్పష్టం చేశారు.

## ఇజ్రాయెల్ - లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ప్రకటించిన ట్రంప్

వాషింగ్టన్/టెల్ అవీవ్, ఏప్రిల్ 16: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించే దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. ఇజ్రాయెల్ – లెబనాన్ మధ్య 10 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ అమలులోకి రానున్నట్లు ఆయన అధికారికంగా వెల్లడించారు. ఈ నిర్ణయం యుద్ధ మేఘాలు కమ్ముకున్న ఈ ప్రాంతంలో శాంతి స్థాపనకు ఒక ఆశాకిరణంగా కనిపిస్తోంది.

**శాంతి స్థాపనే లక్ష్యం...** ఈ కాల్పుల విరమణ తక్షణమే అమలులోకి వస్తుందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ 10 రోజుల వ్యవధిలో ఇరు దేశాల మధ్య శాశ్వత శాంతి ఒప్పందాన్ని కుదిర్చేందుకు దౌత్యపరమైన చర్చలు జరుగుతాయని ఆయన తెలిపారు. 'ఈ ప్రాంతంలో రక్తపాతాన్ని ఆపడమే మా ప్రాధాన్యత. అమాయక ప్రజల ప్రాణాలు పోకూడదని మేము కోరుకుంటున్నాము' అని ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

**కీలక పరిణామాలు:**

ఇజ్రాయెల్ దళాలు – లెబనాన్‌లోని హిజ్బుల్లా గ్రూపుల మధ్య జరుగుతున్న దాడులు ఈ 10 రోజుల పాటు నిలిచిపోతాయి. ఇరాన్ – అమెరికా మధ్య కూడా ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో, ఈ కాల్పుల విరమణ ప్రకటించడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. హొర్ముజ్ జలసంధి వంటి కీలక ప్రాంతాల్లో ఉద్రిక్తతలను తగ్గించడానికి, అంతర్జాతీయ వాణిజ్యానికి ఆటంకం కలగకుండా ఉండటానికి ఈ విరామం ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు.

## రాహుల్‌ను మించిపోయిన రేవంత్

మొదటి పేజీ తరువాయి...

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకునేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన రాంచందర్‌రావు.. రాహుల్, రేవంత్‌కు సంబంధించిన ఓ కార్టూన్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.."రాహుల్ కుర్చీలో తాను కూర్చున్నట్లు రేవంత్ భావిస్తున్నట్లుంది. కాంగ్రెస్‌లో జాతీయనేతగా ఎదిగిపోయానని అనుకుంటున్నారు.. డీలిమిటేషన్ ప్రక్రియలో జీఎస్‌డీపీ, దక్షిణాదికి అన్యాయమంటూ కొత్త అంశాలను మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ ఎంపీలకు ఆయనే డైరక్షన్ ఇస్తున్నారు. రాహుల్‌ను రేవంత్ మాట్లాడనీయడం లేదు. రాహుల్‌కు సబ్జెక్టు తెలియక మాట్లాడడం లేదా? లేక రేవంత్‌కు ఎక్కువ సబ్జెక్టు తెలిసి మాట్లాడుతున్నారో తెలియదు" అని ఎద్దేవా చేశారు. జీఎస్‌డీపీ ప్రాతిపదిక సీట్లు పెంచాలన్న సీఎం రేవంత్ ప్రతిపాదనను తప్పుబట్టారు. మందుబాబులను పెంచి పోషించి రెవెన్యూ పెంచుకుని, జీఎస్‌డీపీ పెరిగిందంటూ దాని ఆధారంగా సీట్లు పెంచమంటారా? అని రేవంత్‌ను నిలదీశారు. రాష్ట్రంలో కులగణన ప్రక్రియ అసంపూర్తిగా జరిగిందన్న రాంచందర్‌రావు.. ముస్లింల జనాభాను ప్రభుత్వం తక్కువగా వెల్లడించిందని ఆరోపించారు. ఇక, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ ఎంపీ లక్ష్మణ్ లక్ష్యంగా పార్టీలో కొందరు చేస్తున్న ఆరోపణలపైనా రాంచందర్‌రావు స్పందించారు. వారిద్దరిపై ప్రేమ ఉంది కాబట్టే ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో స్థానిక సర్దుబాటు మాత్రమే జరిగిందని, ఆ పార్టీతో పొత్తు ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి

మొదటి పేజీ తరువాయి...

అలాగే... 2024–26 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్(సీఏజీఆర్) నమోదయ్యిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, డస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్,ఆర్ సీఐ, హాల్ తదితర కేంద్ర రంగ ప్రభుత్వ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవీ కాకుండా... ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు 'తెలంగాణ బ్రాండ్'ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్ ఎఫ్ డీఏ ర్యాంకింగ్స్ ప్రకారం, ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస్' అవార్డును గెలుచుకుని 'గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్'లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు.

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. టీజీ ఐపాస్ ద్వారా 15 నుంచి 30 రోజుల్లోగా అనుమతులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన 'రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్'ను అందిస్తున్నామన్నారు.

పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు ఒక నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు 'తెలంగాణ' సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తాం. అమెరికా – తెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతాం' అని స్టేట్ డిపార్ట్‌మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా(నేవీ), రెనో బామ్‌ఫోర్డ్(డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్(ఆర్మీ), రెబెక్కా కింగ్(డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్(ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన సభలో ఉన్నంతధికారి ఫోన్‌కే ప్రాధాన్యం!

## - ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఎమ్‌పీడీవో నిర్లక్ష్యం - ప్రజల్లో ఆగ్రహం,వివిధ అధికారుల చర్చ?

ఏప్రిల్ 16 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్ధన్నపేట) ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఓ అధికారి ప్రవర్తన వివాదాస్పదంగా మారింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఎమ్‌పీడీవో వెంకటరమణ వ్యవహారం ప్రజలు, ప్రజాప్రతినిధుల్లో అసహనానికి దారితీసింది.గ్రామంలో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది హాజరయ్యారు. ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు వివరాలు తెలియజేస్తుండగా, సమావేశం ప్రాధాన్యతను విస్మరించినట్లు ఎమ్‌పీడీవో ఫోన్‌లోనే నిమగ్నమై ఉండటం అక్కడి వాతావరణాన్ని చర్చనీయాంశంగా మార్చింది.

వర్ధన్నపేట మండల ఇంచార్జ్ జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి సభను ఉద్దేశించి మాట్లాడుతున్న సమయంలో కూడా తను ఫోన్‌లోనే తలమునకలై ఉండటం గమనించిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్యక్రమం పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడం ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించే చర్యగా అభిప్రాయపడ్డారు.

ఇదే సమయంలో పక్కనే ఉన్న ఎఎంసీ చైర్మన్, "పత్రిక విలేకరులు వీడియో తీస్తున్నారు" అని హెచ్చరించడంతో ఎమ్‌పీడీవో ఒక్కసారిగా అప్రమత్తమై చిరునవ్వుతో స్పందించడం అక్కడున్న వారిలో మరింత చర్చకు దారి తీసింది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్న వేదికపై ఈ విధమైన ప్రవర్తన అనుచితమని పలువురు వ్యాఖ్యానించారు.ప్రభుత్వం గ్రామస్థాయిలో ప్రజలకు చేరువయ్యే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, లేకపోతే ప్రజల్లో నమ్మకం దెబ్బతింటుందని అభిప్రాయాలు,వ్యక్తమవుతున్నాయి. ఈఘటనపై,ఉన్నతాధికారులు స్పందిస్తారా? లేక ఇదే విధంగా నిర్లక్ష్య ధోరణి కొనసాగుతుందా అన్నది చర్చనీయాంశంగా మారింది.







# తాగునీటి సమస్య కు పరిష్కారం



మల్లాపూర్ ఏప్రిల్ 16 ( ప్రజా కలం ప్రతినిధి) : మల్లాపూర్ మండలంలోని కొత్త ధామరాజుపల్లి గ్రామంలో సర్పంచ్ ఎగ్యరపు లింబాద్రి ఆధ్వర్యంలో తాగునీటి కొరతను నివారించేందుకు కీలక చర్యలు చేపట్టారు. గ్రామంలో ఎండాకాలంలో నీటి సమస్యలు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో మూడు కొత్త బోర్లు ఏర్పాటు చేసి, వాటిని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు తాగునీరు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముందస్తు ప్రణాళికతో చేపట్టిన ఈ చర్యల వల్ల రాబోయే రోజుల్లో నీటి సమస్యలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన బోర్లతో గ్రామంలో తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బద్దం హరీష్, బద్దం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయకూడదు..

## - జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్



మల్లాపూర్ ఏప్రిల్ 16 ( ప్రజా కలం ప్రతినిధి) : జగిత్యాల జిల్లా మల్లాపూర్ పీహెచ్‌సీలో టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చిన ప్రజలకు పరీక్షలు నిర్వహించి, వ్యాధి లక్షణాలు, చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. మొత్తం 92 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాహినీ, వైద్య సిబ్బంది హరీష్, రెహమాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## - మెట్‌పల్లి ఆర్డీవో నరసింహా



మెట్‌పల్లి ఏప్రిల్ 16 (ప్రజా కలం ప్రతినిధి )ప్రభుత్వపథకాలనుసద్వినియోగం చేసుకోవాలని మెట్పల్లి ఆర్డీవో నరసింహ అన్నారు. గురువారం నాడు మెట్పల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు ప్రస్తుత పథకాలు, రాబోయే పథకాల గురించి వివరించి ప్రజలు లబ్ధి పొందేలా చూడాలన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నీత, మండల వైద్యాధికారి అంజిత్ రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ దీపిక, వైద్యాధికారి కనకతార, ఆర్ డబ్ల్యూ ఎస్ లు రాజేందర్, వింధ్య, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, హౌసింగ్ ఎ ఈ శరత్, ఏపియం అశోక్, వివిధ స్థాయి అధికారులు, మెట్ పల్లి మండలం సర్పంచ్, వార్డు సభ్యులు,మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# భీంరాజుపల్లి గ్రామంలో 'మంద గొల్లల' బొమ్మల కొలువు

గొల్లపల్లి ఏప్రిల్ 16ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలంలోని భీంరాజుపల్లి గ్రామంలో గురువారం యాదవ కుల సంఘం అధ్యక్షులు సింగారపు లచ్చయ్య నివాస గృహంలో మంద గొల్ల కుల గురువు రామస్వామి అత్యంత వైభవంగా నిర్వహించిన మంద గొల్లల బొమ్మల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. విరాజిల్లుతున్న పురాతన సంప్రదాయం యాదవ కులస్తుల ఆరాధ్య దైవాలైన గంగాదేవి, మల్లికార్జున స్వామి, బీరప్పల వీరగాథలను ప్రతిబింబించేలా ఈ బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. తరతరాలుగా వస్తున్న ఈ మంద గొల్లల



సంప్రదాయం కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాదని, అది తమ వంశ వృక్షానికి,కుల దైవాల చరిత్రకు సజీవ సాక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. కర్రతో చెక్కిన దేవతామూర్తుల బొమ్మలను రంగురంగుల వస్త్రాలతో అలంకరించి కొలువు తీర్చారు. గ్రామంలోని యాదవ కులస్తులతో పాటు ఇతర వర్గాల ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా యాదవ కుల సంఘం అధ్యక్షులు సింగారపు లచ్చయ్య మాట్లాడుతూ.. మాయమైపోతున్న మన ప్రాచీన కళలను, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. మన పూర్వీకుల చరిత్రను, దైవ మహిమలను భవిష్యత్ తరాలకు అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం" అని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలగాని శ్రీలత, ఉప సర్పంచ్ బొమ్మన రాజమ్మ, యాదవ సంఘం నాయకులు సింగారపు దొంగయ్య తదితరులు పాల్గొన్నారు

# ముఖ హాజరుతో ఉపాధి హామీ కూలీల అవస్థలు

## కనెక్ట్ కాని సర్వర్ క్యాప్చర్ కానీ ఐరిస్ - గంటల తరబడి కూలీల ఎదురుచూపులు

గొల్లపల్లి ఏప్రిల్ 16 ప్రజా కలం ప్రతినిధి

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ గ్రామీణ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికాసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రాజ్ గా అండ్ అజివిక మిషన్ ను రూపొందించింది. అధునాతన సాఫ్ట్వేర్ అమలు కొత్త సాంకేతిక నిబంధనలతో ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన సాంకేతికత విధానం క్షేత్ర స్థాయిలో కూలీల పాలిట శాపంగా మారింది. ప్రస్తుతం గ్రామాల్లో ఒక వైపు అధిక ఎండలు మరోవైపు ముఖ హాజరు యాప్ సమస్య నెలకొంది. ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలు మండుటెండలో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. అధికారులు నిర్ణయించిన సమయానికి పని ప్రాంతానికి వెళ్లిన ముఖ హాజరు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. ఉపాధి హామీ నిబంధనల ప్రకారం పని ప్రారంభించే ముందు వ్యక్తి గత ఐరిస్ ఫోటో,పని ముగిసిన నాలుగు గంటల తర్వాత గ్రూప్ ఫోటో తీసి అప్లోడ్ చేయాల్సి ఉ ంటుంది. అయితే ఉదయం 7 గంటలకే పని ప్రదేశానికిహా చేరుకున్న కూలీలకు సాంకేతిక లోపాలు చుక్కలు చూపిస్తున్నాయి. మొబైల్ ఫోన్లో ఐరిస్ స్కాన్ చేస్తున్నప్పుడు పదే పదే క్యాప్చర్ వర్కర్ ఫోటో అగైన్ అని ఎర్రర్ మేసేజ్ వస్తుండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు



పడుతున్నారు. ఎండలు ఎక్కువ కావడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కేవలం ఐరిస్ సమస్యే కాకుండా కేవైసి అప్డేట్ కావడంలేదని ఒక్కో ఫోటో కోసం గంటల సమయం పడుతుంటేహా పని ఎప్పుడూ చేయాలిహా అని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు యాప్ లో పొందుపర్చాలి ఉండగా దీంతో క్షేత్ర స్థాయిలో సిగ్నల్స్ సరిగా లేక ఫోటోలు అప్లోడ్ కాక సిబ్బంది ఒత్తిడికి గురవుతున్నారు. ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలనే నిబంధనలతో ఇటు కూలీలు అటు ఉపాధి హామీ సిబ్బంది ఆటంకాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి సర్వర్ సమస్యలను పరిష్కరించాలని,లేదా సాఫ్ట్వేర్ పని చేయని చోట మ్యానువల్ గా హాజరుతీసుకోవాలని ఉ పాధి హామీ కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

# అక్రిడిటేషన్ కార్డులు జారీపై అపోహలు వద్దు

## అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు కార్డులు జారీ

### నూతన సవరణలతో త్వరలో నూతన జీఓ విడుదల - ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి



పెద్దపల్లి,ఏప్రిల్ 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

హైదరాబాద్ లో గురువారం తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. సమావేశంలో పెద్దపల్లి యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్,జిల్లా అధ్యక్షులు మల్లావర్జుల వంశీ విధ్యానంద్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్ పాల్గొని జర్నలిస్టుల సమస్యలను ప్రెస్ అకాడమి చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని వివరించారు. ఇటీవలి కాలంలో ఆక్రిడిటేషన్ కార్డులు జారీపై ఉన్న అపోహలపై చర్చించారు. ప్రతీ వర్కింగ్ జర్నలిస్టుకు న్యాయం జరగాలని కోరారు. పై డిమాండ్లపై స్పందించిన ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేశన్ కార్డులు అందిస్తామని భరోసా ఇచ్చారు. అసత్య ప్రచారాలు నమ్మొద్దని,రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టులకు న్యాయం జరిగేలా జీఓ సవరింపజేశామని పేర్కొన్నారు. త్వరలోనే కొత్త జీఓ విడుదల కానుందన్నారు. గతంలో కంటే రాష్ట్ర వ్యాప్తంగా 2678 అక్రిడిటేశన్ కార్డులు అదనంగా అందనున్నాయని వివరించారు. వర్కింగ్ జర్నలిస్టులకు యూనియన్ పక్షాన అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డులు జారీ విషయంలో సమస్యలుంటే మా దృష్టికి తీసుకురావాలని వాటిపై తక్షణం స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని యూనియన్ జిల్లా అధ్యక్షులు వంశీ విధ్యానంద్,ప్రధాన కార్యదర్శి అశోక్ కోరారు.


# చలివేంద్రాలు ఏర్పాటు చేసిన ఉపసర్పంచ్



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 16 (ప్రజా కలం ప్రతినిధి ) మండలంలోని డబ్బా గ్రామంలో నూతనంగా ఎన్నికైన గ్రామ ఉపసర్పంచ్ రాపల్లి మహేష్, వార్డు సభ్యులు బైండ్ల విశాల్, బత్తిని మనోజ్ చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. డబ్బా గ్రామంలో గాంధీ సమీపంలో ఒకటి, గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఒకటి ఏర్పాటుచేసి డబ్బా గ్రామ విడిసి అధ్యక్షులు బైండ్ల సంజీవ్, పుప్పాల గజేందర్ ల చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు సౌకర్యార్థం చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చలివేంద్రాలను ఏర్పాటు చేసిన వీరిని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కంటం రమేష్, లింగంపల్లి గంగాధర్, మాజీ ఎంపీటీసీ శాంత జీవన్, గ్రామ పెద్ద మనుషులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ బడికి 'జిల్లా ఛాంపియన్' మకుటం

## - ఊషన్నపల్లి పాఠశాలకు జిల్లా స్థాయి పురస్కారం




పెద్దపల్లి,ఏప్రిల్ 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

కాల్వశ్రీరాంపూర్ మండల పరిధిలోని ఊషన్నపల్లి మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యా రంగంలో తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికి గాను జిల్లాస్థాయి ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ ఛాంపియన్ స్కూల్ అవార్డుకు ఈ పాఠశాల ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల్లో అత్యధిక విద్యా ప్రమాణాలు సాధించినందుకు గాను ఈ గౌరవం దక్కింది. విశేషమేమిటంటే,గత విద్యా సంవత్సరంలో కూడా ఈ పాఠశాల ఇదే విభాగంలో జిల్లాస్థాయి అవార్డును అందుకోవడం గమనార్హం.

ఈ నెల 17న పెద్దపల్లిలోని ఎంబి గార్డెన్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో పాఠశాల బృందం ఈ అవార్డును స్వీకరించనుంది. వరుసగా రెండో ఏడాది జిల్లా స్థాయి ఛాంపియన్‌షిప్ అవార్డు రావడం పట్ల ఎంఈఓ మహేష్,ఎంపీడీవో రామ్మోహన్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేష్,గ్రామ సర్పంచ్ రేకుల జ్యోతిరఘు,ఉప సర్పంచ్ మేడి అశోక్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే వార్డు సభ్యులు ఆవుల సునీత,ముష్కే కుమారస్వామి,కూసలత, ముసుకు అంజయ్య,చంచల వనిత,ముసుకు స్రవంతి,చైర్ పర్సన్ పెండ్లి స్వరూపతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య,ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్,మంద శ్రీవాణి,ఎడ్ల స్రవంతి,గోపిశెట్టి సుప్రియ,బండారి సరిత తదితరులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు అభినందించారు.

# రాజారాంపల్లి గ్రామంలో ఎస్ ఆర్ ఆర్ గార్డెన్స్ లో

# మండల స్థాయి సమావేశం

## ముఖ్య అతిథిగా మండల ప్రత్యేక అధికారి రవి ప్రసాద్ - ఎండపల్లి మండల ఎంపీడీవో దొండ కృపాకర్ అధ్యక్షతన..

ఎండపల్లి, ఏప్రిల్ 16 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామం లో గురువారం రోజున ఎస్ ఆర్ ఆర్ గార్డెన్ లో మండల స్థాయి సమావేశం లో ప్రజాపాలన-- ప్రగతిప్రణాళిక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు లో భాగంగా ఎండపల్లి మండల రాజారాంపల్లి లో సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎండపల్లి మండల ప్రత్యేక అధికారి రవి ప్రసాద్ ఎండపల్లి మండల ఎంపీడీవో దొండ కృపాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశం లో మండల తహసిల్దార్ మాట్లాడు తూ లబ్ది పొందుతున్న వారి వివరాలు ఎండపల్లి మండల పరిధి లో చేయూత పెన్షన్ వృద్ధప్య 1817, వితంతువు 1204, వికలాంగులు 558, గౌడ కళాలి 172, చేనేత 132, ఒంటరి మహిళ 127, బీడీ కార్మికులు 586, మొత్తం కలిపి 4596 పెన్షన్లు లబ్ధి పొందుతున్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ 210 మంది లబ్ధిదారులకు అందజేశామని, కొత్త రేషన్ కార్డ్స్ మరియు కన్వర్షన్ మొత్తం కలిపి 3862 కుటుంబాలకు రేషన్ కార్డ్స్ మంజూరు అయ్యాయని. అలాగే ఇందిరమ్మ మహిళా శక్తి గ్రూపులకు ఇందిరమ్మ చీరలు 5926 చీరలను పంపిణీ చేశామని, అలాగే వడ్డీ లేని రుణాలు డాక్రా మహిళలకు 262 గ్రూపులకు వడ్డీ లేని రుణాలు అందించామని, మండల తహసిల్దార్ తెలిపారు. మండల ఎంఈఓ సముద్రాల హరికృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలోని పాఠశాల విద్యార్థులకు అల్పా హారం పాలు పథకం కింద ప్రతి పాఠశాలకు అందిస్తున్నామని తెలిపారు. హౌసింగ్ ఏఈ గౌతమి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మండల పరిధిలో 476 ఇండ్లు మంజూరు అయ్యాయని ఒక్కో ఇంటికి 5 లక్షల చొప్పున 23 కోట్ల 80 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే వ్యవసాయ శాఖ ఏవో కమాల్ల మహేష్ మాట్లాడుతూ రైతు బీమా పథకం కింద 41 మంది లబ్ధిదారులకు 5 లక్షల చొప్పున రైతు బీమా రూపాయలు 2 కోట్ల ఐదు లక్షల రూపాయలను లబ్ధిదారులకు అందించామని, రైతు భరోసా కింద 9809 మంది రైతులకు 8 కోట్ల 86 లక్షల 19 వేల 550 రూపాయలను అందించామని ఏవో తెలిపారు. ఆరోగ్యశాఖ నుండి డాక్టర్ పి లవ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికీ మండల పరిధిలోని కొంతమందికి ఆపరేషన్లను గుర్తించి వారికి అన్ని రకాల ఆపరేషన్లు చేయించామని తెలిపారు విద్యుత్ శాఖ ఏఈ బండి సమ్మయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు గృహ జ్యోతి పథకం కింద 200 లోపు యూనిట్లను 5379 మందికి ప్రతినెల 15 లక్షల 36,630 రూపాయలను జీరో బిల్లు కింద అందించామని తెలిపారు. అలాగే ఇండ్ల మీద కెళ్ళి వెళ్లే లైన్లు ఉన్నచో అట్టి వాటికి మంత్రి గారు ప్రత్యేక నిధి కింద కొంత అమౌంట్ ఇచ్చారని వాటిని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు మీటర్ల కొరకు రెండు వేల రూపాయలు డిడి కట్టినచో ఐదు నుండి పది పోర్లు ఒక కిలోమీటర్ వరకు లైన్లు వేస్తామని ఏఈ తెలిపారు. ఏపీఎం తులసి మాత




మాట్లాడుతూ మండల పరిధిలో వడ్డీ లేని రుణాలు డాక్రా గ్రూపుల కు 26 గ్రూపులకు 31 కోట్ల 39 లక్షల 59 వేల రూపాయలను అందించామని తెలిపారు. ఐసి డిఎస్ సూపర్వైజర్ అండాలు మాట్లాడుతూ మండల పరిధిలోని కొత్త అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం కింద ప్రతి పిల్లలకు అందించామని వివరించారు. ఎండపల్లి సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజారాంపల్లి సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్ అలాగే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి మాట్లా డారు. అలాగే ఎండపల్లి మాజీ సింగిల్ విండొ చైర్మన్ మద్దుల గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామాల నుండి సర్టిఫికెట్లు పెండింగ్లో ఉంటున్నాయని మా దృష్టికి వచ్చిందని తాసిల్దారుకు వివరించారు. నిబంధనలు, క్షేత్రస్థాయి లో అమలుపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారు ల పై ఉందన్నారు నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు మాత్రం అత్యంత ఉత్సాహంగా ఉన్నారు వారు గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల ప్రణాళికపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రజాప్రతి నిధులు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లేందుకు ఆసక్తి చూపారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం లో అధి కారులు, ప్రజాప్రతినిధులు సమ న్వయం తో పనిచేయాలి.

ఈ కార్యక్రమం లో వెల్గటూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గోల్ల తిరుపతి, ఏఎంసి డైరెక్టర్లు సర్పంచులు సంఘ రమేష్ యాదవ్, జీరెడ్డి మహేందర్ రెడ్డి, తాటిపర్తి రాజవ్వ, గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, మారం సునీత-జలంధర్ రెడ్డి, కందికట్ల అమృత-రాజేష్, బాలసాని శారద-మల్లేశం, ఆవుల మమత-తిరుపతి, సింగిరెడ్డి లింగారెడ్డి, కొంగల జగదీశ్వర్ రెడ్డి, గాదం భాస్కర్, కోడిపెల్లి కొమరమ్మ-శ్రీనివాస్, బెడ్డల ప్రవీణ్ పడిదం లావణ్య-మొగిలి, దర్శనాల నరేష్ సర్పంచులు పాల్గొన్నారు మాజీ సింగిల్ విండో చైర్మన్ గూడ రాంరెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశ వర్కర్లు, సీసీలు, సిఏలు, వివోలు, మహిళలు వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా కలం

శుక్రవారం, ఏప్రిల్ 17, 2026

## హైబ్రీడ్ మోడల్ సాధ్యమా....

లోక్‌సభ సీట్ల సంఖ్యను భారీగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న 543 స్థానాలను 850కి పెంచాలని ప్రతిపాదిస్తూ కేంద్రం గురువారం నాడు బిల్లులను ప్రవేశపెట్టనుంది. ఇందులో భాగంగా రాష్ట్రాల నుండి 815 సీట్లు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి 35 సీట్లు ఉండేలా ప్రణాళిక రూపొందించారు. రెండు వారాలుగా ఈ విషయంపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు సాగుతుండగా, ఎంపీలకు ఈ ముసాయిదా చట్టం ప్రతులను పంపిణీ చేయడంతో ఈ ప్రక్రియ అధికారికంగా ముందడుగు పడింది. రాజ్యాంగంలోని అధికరణ 82 ప్రకారం, ప్రతి జనాభా గణన తర్వాత రాష్ట్రాలకు కేటాయించే లోక్‌సభ సీట్లను జనాభా మార్పులకు అనుగుణంగా సర్దుబాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల విభజన 1971 జనాభా గణన ఆధారంగా జరిగింది. 2001లో చేసిన 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం, 2026 తర్వాత జరిగే మొదటి జనాభా గణన వరకు నియోజకవర్గాల సరిహద్దుల మార్పుపై నిషేధం ఉంది. అయితే, తాజా బిల్లులో ఈ నిబంధనను సవరించి, 2011 జనాభా గణన ఆధారంగానే ఈ పునర్విభజన ప్రక్రియను చేపట్టాలని కేంద్రం భావిస్తోంది.మహిళా రిజర్వేషన్ల అమలుతో ఈ డిలిమిటేషన్ ప్రక్రియ ముడిపడి ఉండటం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం ప్రకారం, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33% సీట్లు కేటాయించాల్సి ఉంది. అయితే ఇది జనాభా గణన మరియు డిలిమిటేషన్ తర్వాతే సాధ్యమని ప్రభుత్వం గతంలో పేర్కొంది. తాజా ప్రతిపాదనల ప్రకారం సీట్ల సంఖ్యను 850కి పెంచితే, అందులో సుమారు 270 సీట్లు మహిళలకు రిజర్వ్ అవుతాయి. లోక్‌సభ స్థానాలను దాదాపు 50 శాతం పెంచాలన్న ప్రతిపాదనపై కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ.. ఈ ప్రక్రియ కేవలం అంకగణితంలా కాకుండా రాజకీయంగా అందరికీ సమన్యాయం చేసేలా ఉండాలని కోరింది. ముఖ్యంగా జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించిన దక్షిణాది రాష్ట్రాలు, కేవలం జనాభా తక్కువగా ఉందన్న కారణంతో పార్లమెంట్‌లో తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోకూడదని సోనియా గాంధీ అభిప్రాయపడ్డారు. ఉత్తరాది రాష్ట్రాలలో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్నందున, సీట్ల పెంపు వల్ల వారికి అదనపు లబ్ధి చేకూరితే దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కినట్లు అవుతుందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పొడిగించిన ప్రభుత్వం, ఈ మూడు రోజుల ప్రత్యేక వ్యవధిలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి లాంటి నేతలు ప్రతిపాదిస్తున్న హైబ్రీడ్ మోడల్, రాష్ట్రాల మధ్య సీట్ల నిష్పత్తి మారకుండా సీట్లు పెంచే వ్యూహాలను కేంద్రం పరిగణనలోకి తీసుకుంటుందో లేదో వేచి చూడాలి. ఏది ఏమైనా, దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చేసే ఈ డిలిమిటేషన్ ప్రక్రియపై ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోంది. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ స్థానాలను పెంచే ప్రక్రియను వేగవంతం చేస్తున్న తరుణంలో, స్టాలిన్ దీనిపై తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు.ముఖ్యమంత్రి స్టాలిన్ తన తాజా వీడియో సందేశంలో కేంద్ర ప్రభుత్వానికి తుది హెచ్చరించారు. కేవలం జనాభా ప్రాతిపదికన డిలిమిటేషన్ చేపడితే, దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది కేవలం బెదిరింపు కాదు.. తమిళనాడు ఎన్నడూ చూడని రీతిలో ఒక మహా ఉద్యమాన్ని చూస్తారు. ప్రతి కుటుంబం వీధిలోకి వస్తుంది, రాష్ట్రం మొత్తం స్తంభిస్తుంది అని ఆయన ఘాటుగా హెచ్చరించారు. 1950, 60లలో హిందీ వ్యతిరేక ఉద్యమాల సమయంలో డీఎంకే చూపిన ఉధృతిని మరోసారి దేశం చూస్తుందని ఆయన సంకేతాలిచ్చారు.తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించి జనాభాను నియంత్రించాయని, ఇప్పుడు జనాభా తక్కువగా ఉందని పార్లమెంట్‌లో సీట్లు తగ్గించడం అంటే అభివృద్ధి చెందిన రాష్ట్రాలను శిక్షించడమేనని స్టాలిన్ వాదిస్తున్నారు. జనాభా పెంచుకున్న రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు ఇచ్చి, నియంత్రించిన రాష్ట్రాలకు అన్యాయం చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఇది సమాఖ్య స్ఫూర్తిపై దాడి అని, దక్షిణాదిని రాజకీయంగా బలహీనపరిచే కుట్రని స్టాలిన్ అంటున్నారు. ఇండియా కూటమిలో కీలక సభ్యుడైన స్టాలిన్, ఈ విషయంలో కూటమి యొక్క గొంతుకగా మారారు. డిలిమిటేషన్ అనేది కేవలం అంకెల గారడీ కాకూడదని, అది రాజకీయ సమానత్వం కల్పించేలా ఉండాలని కూటమి డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రీడ్ మోడల్ జనాభాతో పాటు జిఎస్‌డిపిని పరిగణనలోకి తీసుకోవడం పై కూటమిలో చర్చ జరుగుతోంది. రాష్ట్రాల మధ్య ఉన్న ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్తే తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని కూటమి స్పష్టం చేసింది.మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలంటే డిలిమిటేషన్ తప్పనిసరి అని కేంద్రం చెప్పడాన్ని స్టాలిన్ తప్పుబడుతున్నారు. మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ ఆ పేరుతో దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటాను తగ్గించే ప్రయత్నాన్ని సహించబోమని ఆయన స్పష్టం చేశారు. మహిళా కోటాను నియోజకవర్గాల పెంపుతో సంబంధం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన, స్టాలిన్ హెచ్చరికలతో ఈ డిలిమిటేషన్ అంశం కేవలం తమిళనాడుకు పరిమితం కాకుండా మొత్తం దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి సమస్యగా మారుతోంది. ఇప్పటికే కేరళ, కర్ణాటక నేతలతో స్టాలిన్ సంప్రదింపులు జరుపుతున్నారు. కేంద్రం ఏకపక్షంగా ముందడుగు వేస్తే, ఉత్తరాది వర్సెస్ దక్షిణాది అనే భావన దేశ సమగ్రతకు భంగం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సంఘాల ప్రగతికి 'సెర్ప్'
# సేవలందించాలి



### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,ఏప్రిల్16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

స్వశక్తి సంఘాల ఆదాయాభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యాలను 100 శాతంసాధించడానికి సెర్ప్ సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సెర్ప్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సంఘాల కవరేజ్‌లో పెద్దపల్లి జిల్లా అగ్రస్థానంలో నిలిచినందుకు సిబ్బందిని అభినందించారు.ఇదే స్ఫూర్తితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా బ్యాంక్ లింకేజీ,స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీలో జిల్లాను ముందంజలో ఉంచేలా అందరూ కృషి చేయాలని కోరారు.మహిళా సంఘాల సభ్యులకు ఫుడ్ ప్రాసెసింగ్ రుణాల గ్రౌండింగ్ ప్రక్రియను బ్యాంక్ మేనేజర్లతో సమన్వయం చేసుకుని వేగవంతం చేయాలని సూచించారు.ప్రతి మండలంలో రుణాల లక్ష్యాలను పూర్తిచేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.జిల్లాలో మహిళ శిక్షణల సంస్థ విహబ్ ఆధ్వర్యంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.విహబ్ శిక్షణల కోసం నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మహిళలను సమీకరించి శిక్షణలకు హాజరయ్యేలా సెర్ప్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.సిబ్బంది అందరూ సమన్వయంతో కృషి చేసి అన్ని అంశాలలో జిల్లాను అగ్రభాగంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కే.కాలిందిని, అదనపు డి.ఆర్.డి.ఓ బి.రవీందర్,డిపిఎంలు వెంకటరమణ,సంజీవ్,స్త్రీనిధి ఆర్ఎం దుర్గాప్రసాద్, ఏపీఎంలు,స్త్రీనిధి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమం కోసం ఉమ్మడి పోరాటం

### - జిల్లా ఉమ్మడి కార్యాచరణ సమితి అధ్యక్షులు బొంకూరి శంకర్
### - జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత - నేడు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు



పెద్దపల్లి,ఏప్రిల్ 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ,ఉపాధ్యాయ,విశ్రాంత ఉద్యోగులు మరియు కార్మిక సంఘాల ఉమ్మడి కార్యాచరణ సమితి పిలుపు మేరకు,దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 17న శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా పాలనాధికారిని కలిసి,వివిధ సంఘాల నాయకుల సంతకాలతో కూడిన ముందస్తు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఉమ్మడి కార్యాచరణ సమితి అధ్యక్షులు బొంకూరి శంకర్ మాట్లాడుతూ కొత్త వేతన సవరణ నివేదిక అమలు,పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం,బకాయి పడిన వేతన బిల్లుల విడుదల,తక్షణ నగదు రహిత ఆరోగ్య భద్రత కల్పన మరియు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించడం వంటి ప్రధాన డిమాండ్ల సాధనకై ఈ పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు.రాష్ట్ర సమితి ఆదేశాల ప్రకారం నేడు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యాలయాల ఎదుట నిరసనలు తెలపాలని, అలాగే మే 5న చేపట్టబోయే నిరాహార దీక్షలకు సమాయత్తం కావాలని కోరారు.తెలంగాణ మలిదశ ఉద్యమ స్ఫూర్తితో ప్రతి ఉద్యోగి ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి ప్రతినిధి కట్కం రమేష్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు బ్రహ్మానంద రెడ్డి,సాజిద్ అలీ,రవీంద్రనాథ్,ఆడెపు శ్రీనివాస్,ఎడ్ల కొమురయ్య, శ్రీధర్,అయిరెడ్డి సందీప్ రెడ్డి,మెరుగు సతీష్, కాంపెల్లి లక్ష్మణ్,గుర్రం శ్రీనివాస్ గౌడ్,కిషన్,కనకయ్య, పోచయ్య, అంజయ్య,రవీందర్,మహేందర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అజాగ్రత్తగా వాహనం నడపడం ప్రాణాలకే ముప్పు



### - పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి

పెద్దపల్లి,ఏప్రిల్ 16:(ప్రజాకాలం జిల్లా ప్రతినిధి)

అజాగ్రత్తగా వాహనం నడపడం అంటే మన ప్రాణాలను మనమే పణంగా పెట్టడమేనని పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి పేర్కొన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా,గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్.కే ఫంక్షన్ హాల్‌లో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. పెద్దపల్లి రూరల్ ఎస్సై మల్లేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డీసీపీ రామ్ రెడ్డితో పాటు ఏసీపీ జి.కృష్ణ,సీఐ ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీపీ రామ్ రెడ్డి మాట్లాడుతూ మితిమీరిన వేగం,మద్యం సేవించి వాహనం నడపడం,హెల్మెట్ ధరించకపోవడం వంటి చిన్న చిన్న పొరపాట్లే కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కేవలం జరిమానాల భయంతో కాకుండా, బాధ్యతగల పౌరులుగా ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటించాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా డ్రైవింగ్ సమయంలో డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులను అలవాటు చేసు కోవాలని, ఎదుటివారు పొరపాటు చేసినా మనం అప్రమత్తంగా ఉండి ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు.సీట్‌బెల్ట్ ధరించడం, డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ వాడకపోవడం వంటి ప్రాథమిక సూత్రాలు ప్రాణరక్షకాలని ఆయన స్పష్టం చేశారు.ఒక క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ సంస్కృతిని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.అనంతరం రోడ్డు భద్రతా నియమాలను ఎల్లవేళలా పాటిస్తామని డీసీపీ సమక్షంలో హాజరైన ప్రజాప్రతినిధులు,విద్యార్థులు,యువతతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్వో, ఎంపీడీఓ,ఎంఏఓ తదితర ప్రభుత్వ విభాగాల అధికారులు,గ్రామ సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు వృత్తిపరమైన
## నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

### - ధ్రువీకరణ పత్రాలను అందించిన బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ


ఎండపల్లి, ధర్మారం ఏప్రిల్ 16 : ( ప్రజా కలం ప్రతినిధి )

ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండలం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కళాశాల లో ఘనంగా ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్లు పంపిణీ చేసిన ప్రిన్సిపల్ అరుణ ఇంటర్మీడియట్ వృత్తి విద్య కోర్సులో భాగంగా ఇంటర్న్ షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గురువారం ధ్రువీకరణ పత్రాలను ప్రిన్సిపల్ అరుణ అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించు కున్నప్పుడే భవిష్యత్తులో స్థిరపడుతారని ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. మల్లాపూర్ గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను గుర్తిస్తూ వారిని



ప్రత్యేకంగా అభినందించారు. ఈ మొత్తం శిక్షణ కార్యక్రమాన్ని ఒకేషనల్ ట్రైనర్స్ సుప్రజ, పుష్పలత విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నరు.

## ఈజీఎస్ లో జగ్గాసాగర్ కు 36వ స్థానం



మెట్ పల్లి ఏప్రిల్ 16( ప్రజా కలం ప్రతినిధి) ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పించడంలో రాష్ట్రంలో ఈజీఎస్ అమలవుతున్న 12760 గ్రామ పంచాయితీలలో మెట్ పల్లి మండలం జగ్గసాగర్ గ్రామంకు 36వ స్థానం దక్కింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈ పథకంలో కూలీలకు మెరుగైన ఉపాధిని కల్పిస్తున్న సంబంధిత సిబ్బందిని స్పెషల్ కమిషనర్, జాయింట్ కమిషనర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి,మెట్పల్లి యంపీడిఓ సురేశ్, ఎంపీవో మహేశ్వర్ తదితరులు జగ్గసాగర్ ఫీల్డ్ అసిస్టెంట్ కోరం వినోద్ ను ఈజిఎస్ సిబ్బందిని అభినందించారు. అనంతరం కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ను ఘనంగా సన్మానిశీచడంతో పాటు 1000 రూపాయలు నగదు బహుమతి అందించి అభినందించారు.

## మృతురాలికి భగవంతుడు శాంతి ప్రసాదించాలి


### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ - పాషా, అజీమ్ లకు పరామర్శ



మెట్ పల్లి ఏప్రిల్ 16( ప్రజా కలం ప్రతినిధి ) ఇటీవల మరణించిన ఖుతుబోద్దీన్ పాషా,అజీమ్ ల తల్లి ఆత్మకు భగవంతుడు శాంతి ప్రసాదించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషా, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శి అజీమ్ లను ఆయన పరామర్శించారు. తల్లి మృతికి గల కారణాలు తెలుసుకొని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్ రెడ్డి, కౌన్సిలర్ పురు షోత్తం,మాజీ కౌన్సిలర్ కిషోర్,మాజీ కో ఆప్షన్ మెంబర్ పన్నాల మాధవ రెడ్డి, పూదరి సుధాకర్ గౌడ్, విష్ణు వర్ధన్, మాజీ సర్పంచ్ తిరుపతి రెడ్డి, మొరపు తేజ,చిరంజీవి, ఫరూక్ బెగ్, జియా ఉల్ హక్,మురళి,వేముల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ బాట

### - శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విజయరమణా రావు




పెద్దపల్లి,ఏప్రిల్ 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

రాజ్యసభ సభ్యుడిగా పార్లమెంటులో ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డిని న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రభుత్వ విప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ సోదర సమానులు వేం నరేందర్ రెడ్డి ప్రజల సమస్యలను పార్లమెంటులో బలంగా వినిపించి రాష్ట్రానికి న్యాయం చేసే నాయకుడిగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.కేంద్రం నుండి తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు,నిధుల సాధనలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని,తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యత్వం రాష్ట్ర అభివృద్ధికి మరింత తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు,మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్,బొజ్జు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతమైన న్యాయమే లక్ష్యం

### - నేడు పెద్దపల్లిలో నూతన కోర్టు ప్రారంభం
### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

పెద్దపల్లి,ఏప్రిల్ 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) జిల్లాలో న్యాయ సేవలను మరింత వేగవంతం చేస్తూ నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి మరియు అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టు నేడు ఏప్రిల్ ఉదయం ప్రారంభం కానుంది.ఈ మేరకు జిల్లా ప్రధాన మరియు సెషన్స్ న్యాయమూర్తి సునీత కుంచాల గురువారం ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. హైకోర్టు న్యాయమూర్తి మరియు పెద్దపల్లి జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీ నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి,వర్చువల్ విధానం ద్వారా ఈ నూతన కోర్టును ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమంలో హైకోర్టుకు చెందిన ఇతర న్యాయమూర్తులు కూడా పాల్గొననున్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ కొత్త కోర్టు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా,వేగంగా అందుతాయని,పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తగిన ప్రాధాన్యతనిచ్చి విస్తృత ప్రచారం కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



# రోడ్డు ప్రమాదాల నియంత్రణ మన అందరి బాధ్యత



## – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి,ఏప్రిల్ 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రజా పాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎంబీ గార్డెన్స్ లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ తెలంగాణలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలన పేరిట పాలన కొనసాగుతుందని,ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,నూతన రేషన్ కార్డుల జారీ,సన్న బియ్యం,రైతు భరోసా,ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పింఛన్లు,గృహ జ్యోతి,500 రూపాయలకు గ్యాస్ సిలిండర్,ఇందిరా మహిళా శక్తి పేరిట వడ్డీ లేని రుణాలు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని,ప్రజల నుండి సూచనలు స్వీకరించి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.మున్సిపల్ వార్డుల్లో ప్రజలకు ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని,ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు ఉంటే వెంటనే యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని పేర్కొన్న కలెక్టర్,తీవ్రవాద దాడులు లేదా ఘోర రోగాల కంటే రోడ్డు ప్రమాదాల వల్ల మరణాలు ఎక్కువగా ఉండటం ఆందోళనకరమని అన్నారు.ప్రమాదాల నియంత్రణకు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఏరైవ్–ఏలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్ నివారణ,ఓవర్ స్పీడింగ్ తగ్గించడం,హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించడం వంటి ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్‌లోపు బాధితులను ఆసుపత్రికి తరలిస్తే రహ వీర్ పథకం కింద రూ.25వేల ప్రోత్సాహకం అందిస్తామని,అలాగే బాధితులకు సమీప ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్స సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి రాంరెడ్డి,మున్సిపల్ కమిషనర్ వెంకటేష్,మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ను
# సన్మానించిన ఐకేపీ ఏపీఎం



మెట్ పల్లి ఏప్రిల్ 16 (ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్యను ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ ఏపీఎం)అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గట్ల అశోక్ తన కార్యాలయంలో గురువారం రోజున శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీఎం అశోక్ మాట్లాడుతూ, ప్రిన్సిపాల్ తనకు విజ్ఞానాన్ని అందించడం వల్లనే తాను ఈ స్థాయిలో ఉన్నానని ప్రకటించారు. క్రమశిక్షణ, వినయ, విధేయతలు గల విద్యార్థులు,ఎప్పుడైనా మంచి స్థానంలో ఉంటారని,అందువల్ల అశోక్ కు పదోన్నతులు సత్వరమే రావాలని మనసారా ఆకాంక్షిస్తున్నానని ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో అటుకుల బాబుతో పాటు ఐకేపీ సీసీలు సూరయ్య, అశోక్,అకౌంటెంట్ ప్రతిభ,వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో డ్రైవర్లకు కంటి పరీక్షలు

- ధర్మపురి సిఐ రామ్ నర్సింహారెడ్డి ధర్మపురి ఎస్సై జి మహేష్ ఎం రవీందర్ ఆధ్వర్యంలో
- పాల్గొన్న ధర్మపురి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్



ఎండపల్లి, ధర్మపురి ఏప్రిల్ 16 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణం లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అరేవ్, అలైవ్, రోడ్డు భద్రత కార్య క్రమం లో భాగంగా గురువారం రోజున ధర్మపురి పట్టణం లోని ప్రభుత్వ హసుపత్రి లో డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయడం జరిగింది ఈ సందర్భంగా పట్టణంలోని ఆటో డ్రైవర్లకు, కారు డ్రైవర్లకు, గూడ్స్ వాహనాల డ్రైవర్ల అంద రికీ ధర్మపురి ప్రభుత్వ హసుపత్రి లో హసుపత్రి కంటి వైద్య నిపు ణుడు డాక్టర్ తిరుపతి, హసుపత్రి సుపరిండెంట్ డాక్టర్ రవి, ధర్మపురి సీఐ ఎలపాటి రామ్ నర్సింహారెడ్డి, ధర్మపురి ఎస్సైలు జి మహేష్, ఎం రవీందర్ ధర్మపురి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యం లో కంటికి సంబంధించిన పరీక్షలు నిర్వ హించడం జరిగినది. ఈ సంద ర్భంగా ధర్మపురి సీఐ రామ్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ వాహ నం నడిపే వ్యక్తుల అందరికీ కంటి చూపు అనేది ఎంత ముఖ్యమో తెలియజేశారు. కంటి చూపు సమస్యల తో వాహనాలు నడి పితే వచ్చే అనర్థాల గురించి వివరించారు. కంటిచూపు సమస్య ఉన్న వ్యక్తి దానికి సంబంధించిన అద్దాలను ఉ పయోగించాలని తద్వారా ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉందని తెలియజేశారు. రాత్రి పూట వాహనాలు నడిపే వ్యక్తులకు కంటికి సంబంధించిన జాగ్రత్తలను తెలిపినారు. డ్రైవర్ల కంటి చూపు మీద వారి యొక్క జీవితం తో పాటు ఆ వాహనం లో ప్రయాణించే వ్యక్తుల యొక్క జీవి తాలు కూడా ఆధారపడి ఉంటా యని వివరించారు. ఇంకా ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది, పలువురు డ్రైవర్లు, పట్టణ ప్రజలు పాల్గొనడం జరిగిందని ధర్మపురి ఎస్సై జి మహేష్ తెలిపారు.

# ప్రమాదాల నివారణకే 'అరైవ్ అలైవ్'

- డ్రైవర్లకు ఉచిత నేత్ర పరీక్షలు
- ముఖ్య అతిథిగా హాజరైన మెట్‌పల్లి డీఎస్పీ ఏ. రాములు
- పాల్గొన్న సి.ఐ. వి. అనిల్ కుమార్, ఎస్.ఐ. పి. కిరణ్ కుమార్
- సాయి శ్రీనివాస్ ఐ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరం



మెట్‌పల్లి, ఏప్రిల్ 16 (ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా చేపట్టిన.అరైవ్ అలైవ్' (ఎర్రివే అలివేలు ) కార్యక్రమం మెట్‌పల్లిలో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం మెట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆర్టీసీ బస్సు, లారీ, ఆటో మరియు టాక్సీ డ్రైవర్లకు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మెట్‌పల్లి డీఎస్పీ ఏ. రాములు గారి ఆధ్వర్యంలో, సీఐ వి. అనిల్ కుమార్, ఎస్ఐ పి. కిరణ్ కుమార్ సమన్వయంతో విజయవంతంగా జరిగింది.

ఈ శిబిరంలో ఆర్ టి సి బస్సులు, లారీలు, ఆటోలు, టాక్సీల డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. డ్రైవర్లకు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి సూచనలు ఇవ్వడంతో పాటు చూపు సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలు మరియు మందులు అందజేశారు. ఈ కార్యక్రమానికి.మెట్‌పల్లి డీఎస్పీ ఏ. రాములు.ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై కూడా దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎలా జరుగుతాయో ముందుగా ఊహించలేమని, కాబట్టి నివారణ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనల వల్ల కుటుంబాలకు తీరని నష్టం కలుగుతుందని అన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం మరియు చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయడం వలననే జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు, దీర్ఘదూర ప్రయాణాలు చేసే లారీ మరియు బస్సు డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు లేకపోతే, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్ బోర్డులు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల డ్రైవర్లు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా, సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. వాహన చోదకులకు స్పష్టమైన చూపు ఉండటం రోడ్డు భద్రతలో అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణాలు చేసే డ్రైవర్లు చూపు సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకూడదని, చిన్న పొరపాటు ప్రాణాల మీదకు వస్తుందని హెచ్చరించారు. డ్రైవర్లు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారానే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించగలమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి సమయంలో మరియు దీర్ఘదూర ప్రయాణాలు చేసే డ్రైవర్లు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

మెట్‌పల్లి సి.ఐ. వి. అనిల్ కుమార్.మాట్లాడుతూ "డ్రైవింగ్ సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు శారీరక దృఢత్వం కూడా ముఖ్యమే. డ్రైవర్ల క్షేమం కోరి ఈ ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేశామని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. ఎస్.ఐ. పి. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.మెట్‌పల్లిలోనిసాయి శ్రీనివాస్ ఐ హాస్పిటల్ అధినేత బెజ్జారపు శ్రీనివాస్ మరియువారి 8 మంది వైద్య బృందం ఆధునిక పరికరాలతో 108 మంది డ్రైవర్లకుపరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు, అవసరమైన వారికి కళ్లద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని పోలీసులు మరియు వైద్య సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించారు. డ్రైవర్ల ఆరోగ్య సంరక్షణతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో
# సమగ్ర మార్పు తీసుకురావాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- గ్రామ, మండల స్థాయిలో ప్రజాపాలన కార్యక్రమాలు విజయవంతంగా అమలు
- స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేసి సమస్యల పరిష్కారం వేగవంతం చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి
- సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలి
- కూసుమంచి మండల కేంద్రంలో విజయ రామ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మండల స్థాయి ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



పాలేరు ఏప్రిల్ 16(ప్రజా కలం న్యూస్ )

జిల్లాలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యచరణతో గ్రామాలలో సమగ్ర మార్పు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని విజయరామ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మండల స్థాయి ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మార్చి 6 నుండి ప్రతిష్టాత్మకంగా 99 రోజుల "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలోని ప్రతి అంశాన్ని ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏప్రిల్ 2న గ్రామ స్థాయి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని, అదే విధంగా మండల కేంద్రాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఇటీవల గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉత్సాహంతో ఉన్నారని, వారిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు.గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉన్న సమస్యలను స్థానిక నాయకత్వంతోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పెండింగ్ నిధులను విడుదల చేసిందని తెలిపారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి పరిష్కరించాలని, ముఖ్యంగా శానిటేషన్, వీధి దీపాల నిర్వహణ, మల్టీ పర్పస్ వర్కర్లకు సమయానికి వేతనాల చెల్లింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ప్రతి నియోజక వర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేయగా, ఖమ్మం జిల్లాకు సుమారు 16 వేల 500 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో 2800 ఇళ్లు పూర్తయ్యాయని, 8200 ఇళ్లకు స్లాబ్ పనులు పూర్తయ్యాయని, తొందరలోనే సుమారు 10 వేల ఇళ్లు ప్రారంభోత్సవానికి సిద్ధమవుతాయని చెప్పారు. కూసుమంచి మండలంలో 690 ఇళ్లు మంజూరు కాగా, ఇంకా ప్రారంభం కాని 43 ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించేలా సర్పంచులు, స్థానిక నాయకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. కూసుమంచి మండలంలో కొత్త జూనియర్ కాలేజీ, 100 పడకల ఆసుపత్రి నిర్మాణాలకు పునాది పడిందని, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అదే విధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం, కొత్త రేషన్ కార్డులు, 500 గ్యాస్ సిలిండర్, వడ్డీ లేని రుణాలు, క్వింటాల్‌కు 500 బోనస్, కల్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూసుమంచి మండలాన్ని ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలులో ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రమేష్, కూసుమంచి మండల ఇన్చార్జి ఎంపీడీవో రాజారావు, తహసీల్దార్ సైదులు, అగ్రికల్చర్ ఆఫీసర్ వాణి, హెచ్ ఓ అపర్ణ, ఎంఈఓ వీరస్వామి, ఐసిడిఎస్ ఉమా, వైద్యాధికారి డాక్టర్ సాయి, వెటర్నరీ డాక్టర్ నీలకంఠం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు



## - జిల్లా విద్యాశాఖ అధికారి శారద

పెద్దపల్లి, ఏప్రిల్ 16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలో ఈ నెల 20 నుంచి 27 వరకు నిర్వహించనున్న ఓపెన్ స్కూల్ 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా,సజావుగా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శారద ఆదేశించారు.గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పోలీస్,రెవెన్యూ,వైద్య,విద్యుత్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో కలిసి ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని,పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం 163 బీఎన్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని,కేంద్రాల సమీపంలోని జిరాక్స్ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని స్పష్టం చేశారు. ప్రశ్నాపత్రాల రవాణా,భద్రత కోసం ప్రతి కేంద్రంలో పోలీస్ బందోబస్తుతో పాటు కానిస్టేబుళ్లు, హోం గార్డులు విధుల్లో ఉండాలని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా,త్రాగునీరు,పారిశుధ్యం ఉండేలా చూడాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు.ప్రతి కేంద్రంలో వైద్య సిబ్బందితో కూడిన ఫస్ట్ ఎయిడ్ సదుపాయం, అవసరమైన చోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని,మున్సిపల్ అధికారులు పరీక్షా హాళ్లను ముందే శుభ్రపరిచి శానిటైజేషన్ చేయాలని సూచించారు.సిట్టింగ్ స్క్వాడ్‌ల నియామకం,సమాధాన పత్రాల భద్రత మరియు పంపిణీ వంటి అంశాల్లో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని,విద్యుత్ అంతరాయం కలగకుండా ట్రాన్స్‌కో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.పరీక్షల నిర్వహణలో పాల్గొనే ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి,జిల్లాలో పరీక్షల ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్,పోలీసు,రెవెన్యూ,వైద్య,విద్యుత్, పోస్టల్,మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాపయ్యపేటలో విషాదం... హర్ష నాయక్ కన్నుమూత

## మీడియా మిత్రులు, ప్రజాప్రతినిధుల నివాళి - ఆటపాటల మధ్య అంతిమయాత్రకు భారీగా హాజరైన జనసందోహం

ఏప్రిల్ 16 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్/ నర్సంపేట)

వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండల కేంద్రంలోని పాపయ్యపేట గ్రామంలో విషాదం నెలకొంది. ఉమ్మడి వరంగల్ జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జాటోత్ యాకూబ్ నాయక్ తండ్రి హర్ష నాయక్ ఈరోజు అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. ఈ విషాద వార్త తెలుసుకున్న వరంగల్ జిల్లా మీడియా ప్రతినిధులు జన్ను శ్రీనివాస్ బాబు, ఎస్.కె. యాకూబ్ తదితర మిత్రబృందం గ్రామానికి చేరుకుని హర్ష నాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తదుపరి నిర్వహించిన అంతిమయాత్రలో బంధువులు, స్నేహితులు, రాజకీయ నాయకులు, మహిళలు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు



పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆటపాటలు, నృత్యాలతో సాగిన ఈ అంతిమయాత్రలో గ్రామం మొత్తం పాల్గొని హర్ష నాయక్‌కు ఘనంగా వీడ్కోలు పలికింది.

# తానూర్ డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలకు ఘన సన్మానం



తానూర్,ఏప్రిల్ 16(ప్రజా కలం):

నిర్మల్ జిల్లా తానూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ తహసీల్దార్ రవీందర్, అలాగే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్ఐలు) సాయికిరణ్, నరేష్‌లను మండల డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించారు,?ఈ సందర్భంగా డీలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ.. అధికారులు మండల ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు, ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు శంకర్ కులకర్ణి, మండలంలోని వివిధ గ్రామాల డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సిబిఎస్ఈ ఫలితాల్లో మేధా
# స్కూల్ టాపర్ గా బొర్ర దీక్షిత
### - షాద్ నగర్ పట్టణ కేంద్రంలో సెకండ్ టాపర్




నందిగామ ఏప్రిల్ 16 (ప్రజా కలం):ప్రతినిధి సిబిఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో బొర్ర దీక్షిత ఉత్తమ ప్రతిభను కనబరచి మేధా స్కూల్ టాపర్ గా నిలిచి అందరి మన్ననలను పొందుతుంది.నందిగామ మండల కేంద్రానికి చెందిన బొర్ర ఆంజనేయులు (బంటు),లక్ష్మీ దంపతుల ప్రథమ కుమార్తె బొర్ర దీక్షిత. షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని మేధా స్కూల్ లో విద్యను అభ్యసిస్తున్నది. బుధవారం సాయంత్రం వెలువడిన సిబిఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో స్కూల్ టాపర్ తో పాటు షాద్ నగర్ పట్టణ కేంద్రంలోనే టౌన్ సెకండ్ టాపర్ గా నిలిచింది. ఫలితాల్లో చక్కని ప్రతిభ కనబరచిన దీక్షితను పాఠశాల అధ్యాపకులు,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి, స్వీట్లు తినిపించారు.అనంతరం దీక్షితను అధ్యాపకులు,తల్లిదండ్రులు శాలువలతో సన్మానం చేసి అభినందించారు.భవిష్యత్తులో మరెన్నో ఉత్తమ ఫలితాలు సాధించి, ఉన్నతమైన శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని పేర్కొన్నారు.

# "అరైవ్ అలైవ్" కార్యక్రమం లో భాగంగా సోషల్ మీడియా డే విజయవంతం
### - వాహనదారులు డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాలు తప్పనిసరి పాటించాలి
### - జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



నిర్మల్ ఏప్రిల్ 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా కొనసాగుతున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమం నాల్గవ రోజు సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియా డే ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం, ప్రమాదాలను నివారించడం వంటి అంశాలపై ప్రజలకు వివరంగా తెలియజేశారు. వాహనదారులకు సీట్ బెల్ట్ ధరించడం ఎంత ముఖ్యమో వివరించడంతో పాటు, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాల గురించి హెచ్చరించారు. అలాగే, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులను అనుసరించడం ద్వారా ప్రమాదాలను ఎలా నివారించవచ్చో సూచించారు. ముఖ్యంగా, మైనర్ డ్రైవింగ్‌ను పూర్తిగా నిరోధించాల్సిన అవసరాన్ని ప్రజలకు స్పష్టంగా తెలియజేశారు. అలాగే, పోలీస్ సిబ్బంది తమ స్టేషన్ పరిధిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు,సమాచారం సోషల్ మీడియా వేదికలలో అప్లోడ్ చేసి, మరింత మందికి రోడ్డు భద్రతపై అవగాహన చేరేలా చర్యలు తీసుకున్నారు. ఈ అరైవ్ అలైవ్ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులతో పాటు, అన్ని శాఖల అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు యువత, తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన అంశాలు పరిష్కరించాలి
### - జేపీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎం థామస్ రెడ్డి




నిర్మల్ ఏప్రిల్ 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) రాష్ట్ర ఆర్టీసీ జేపీసీ పిలుపుమేరకు నిర్మల్ డిపోలో గేటు ముందర గురువారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జేపీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎం థామస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన అంశాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు రావలసిన జీతభత్యాల సవరణ వెంటనే చేయాలని లేని పక్షంలో సమ్మె జరుగుతుందని చెప్పేసి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో డిపో జేపీసీ నాయకులు అలాగే రాష్ట్ర అధ్యక్షులు ఏఆర్ రెడ్డి జిల్లా కార్యదర్శి గంగాధర్ జిల్లా అధ్యక్షులు ఈవిఆర్ కిషన్ డిపో జేపీసీ నాయకులు పోశెట్టి జి రాజేశ్వర్ రమేష్ రమణ ఉద్యోగులు పాల్గొన్నారు.

## తానూర్‌లో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'పై అవగాహన సదస్సు

తానూర్, ఏప్రిల్ 16(ప్రజా కలం): మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' అంశంపై మండల స్థాయి అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి డీఎల్పీవో లక్ష్మణ్, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథులుగా హాజరై, ప్రభుత్వ పథకాలు మరియు ప్రగతి ప్రణాళికల గురించి వివరించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగాలని, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు, గ్రామాల అభివృద్ధిలో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా గుర్తుచేశారు, ఈ సమావేశంలో ఎంపీడీవో అమీర్ ఖాన్, ఎంఆర్ఓ మహేందర్ నాథ్, ఎంఇఓ నరేందర్, ఎఇవో మనిషాతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి పకడ్బందీ చర్యలు
### - జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి - భూ భారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
### - కూసుమంచి మండలంలో ఇంటిగ్రేటెడ్హౌ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్ట్ అమలు పై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



పాలేరు ఏప్రిల్ 16( ప్రజా కలం న్యూస్ )

ప్రజలకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి, భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.

గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్ట్ అమలు పై రెవెన్యూ, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, భూ సమస్యలకు పరిష్కారం కోసం రెవెన్యూ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు క్రిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ నుహౌప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలో ప్రవేశపెట్టిందని అన్నారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద భూములు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ లు అందించే దిశగా ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ రూపొందించామని అన్నారు. రైతులు ఇంటి వద్ద నుంచి కూడా స్లాట్ బుకింగ్ చేసుకునేలా పోర్టల్ తయారు చేశామని, రైతులు లాగిన్ కాగానే భూమి వివరాలు కనిపిస్తాయని, ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు చెల్లించిన తర్వాత గ్రామంలోని లైసెన్స్ సర్వేయర్ లాగిన్ కు వెళ్తాయని, రెండు రోజుల్లో ఆ రైతు భూమికి సరిహద్దు ఉన్న రైతులకు నోటీసులు జారీ చేసి ఏడు రోజుల లోపు సర్వే పూర్తి చేస్తారని, ఈ వివరాలను సర్వేయర్ సిస్టంలో నమోదు చేశాక దరఖాస్తుదారుడైన రైతు సర్వే మ్యాప్ నకు యూనిక్, భూధార్ నెంబర్లు కేటాయిస్తారని భూభారతి పోర్టల్ లో కూడా వివరాలు నిక్షిప్తమవుతాయని అన్నారు. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ జనరేట్ చేసి పోర్టల్ లో అప్లోడ్ చేస్తారని ఈ ప్రక్రియలు దరఖాస్తు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తి వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్ మొబైల్ నెంబర్ కు మెసేజ్ వస్తాయని తెలిపారు.హౌ పైలెట్ ప్రాజెక్టు క్రింద ముందుగా కూసుమంచి మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భూ భారతి కింద ఉన్న దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పరిష్కారించేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ స్పెషల్ అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దారు సైదులు, కలెక్టరేట్ భూ భారతి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**నిర్ణీత గడువు లోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**

పాలేరు నియోజకవర్గంలో గురువారం చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా నియమిత గడువు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.గురువారం పాలేరు నియోజకవర్గం పరిధిలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. ముందుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మండల స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం కూసుమంచి మండల కేంద్రంలో 5 ఎకరాల విస్తీర్ణంలో 45 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 108 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలు, ప్రధాన భవన నిర్మాణాల పనుల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. పనులను నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఉన్నత విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. అదే విధంగా కూసుమంచిలో నిర్మిస్తున్న 100 పడకల ఏరియా ఆసుపత్రి పూర్తి కావడంతో పరిసర ప్రాంతాల ప్రజలకు తక్షణ, మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు. అలాగే ప్రజలకు ఉపయోగపడే ఈ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి అయితే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని, అందుకుగాను సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకతతో, బాధ్యతతో పనులు నిర్వహించడం ద్వారా జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్ గౌడ్, పాలేరు నియోజకవర్గ స్పెషల్ అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జన్మదినం సందర్భంగా పాఠశాల
# లైబ్రరీకి పుస్తకాల బహుకరణ



(వరంగల్ /పర్వతగిరి) ఏప్రిల్ 16, ప్రజాకలం ప్రతినిధి స్థానిక ఉన్నత పాఠశాల జడ్పిహెచ్ఎస్ కొంకపాక లో గురువారం గ్రామ నివాసి, ఆధునిక పద్ధతులలో వివిధ క్రొత్త రకాల పంటలను పండిస్తూ ఆదర్శ రైతు గా నిలుస్తున్న తక్కల్లపెల్లి సంతోష్ అమెరికా లో ఉంటున్న తమ కుమారుడు తక్కల్లపెల్లి శ్రీకర్ రావు పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు పది వేల రూపాయల విలువ గల పుస్తకాలను బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి అల్లందాసు బిక్షపతి మాట్లాడుతూ పుస్తకాలను ప్రతీ రోజు చదవడం వల్ల ఆలోచనా శక్తి, భాషా నైపుణ్యం పెరుగుడం తో పాటు సమయ సద్వినియోగం జరుగుతుందని, ప్రతీ రోజు పిల్లలు లైబ్రరీ కి వెళ్లే అలవాటు పెంచుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న ముఖ్య అతిథి సర్పంచ్ రాయభారపు రమాదేవి మాట్లాడుతూ పుట్టిన రోజు జరుపుకోవడం లో వింత పోకడలు అవలంబిస్తున్న ఈ రోజుల్లో పాఠశాలకు పుస్తకాలను బహుకరించడం చాలా ఉన్నతమైన ఆలోచన అని దాత సంతోష్ కుటుంబాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు లింగమూర్తి, విశ్వనాథ శర్మ, చెడుపాక కృష్ణమూర్తి, వెనిశెట్టి కృష్ణమూర్తి, ఆఫీజ్, వెంకటేశ్వర్లు, రఘుప్రసాద్, మహబూబ్ పాషా, లలిత, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం
### - పార్లమెంట్‌లో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నేతల శుభాకాంక్షల వెల్లువ
### - ప్రజల ఆశయాలకు కట్టుబడి పనిచేస్తానన్న నరేందర్ రెడ్డి



ఏప్రిల్ 16 ప్రజా కలం ప్రతినిధి: (వరంగల్) దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో ఈరోజు వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, బుర్ర రాజశేఖర్ గౌడ్, రాజు కుమార్ తదితరులు కలిసి నరేందర్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆయనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ప్రమాణ స్వీకారం అనంతరం వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల్లో మమేకమై, వారి అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతానని తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా పలువురు కార్యకర్తలు, అభిమానులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాయపర్తిలో జాతీయ అగ్నిప్రమాద నివారణ వారోత్సవాలు
### అగ్నిప్రమాదాలపై అప్రమత్తతే రక్షణ -వర్ధన్నపేట ఫైర్ స్టేషన్ ఆఫీసర్



ఏప్రిల్ 16 ప్రజాకలం ప్రతినిది: (వరంగల్ /రాయపర్తి) జాతీయ అగ్నిప్రమాద నివారణ వారోత్సవాల సందర్భంగా గురువారం (16-04-2026) రాయపర్తి ప్రాంతంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గృహాలలో తరచుగా జరిగే అగ్నిప్రమాదాల కు ప్రధాన కారణాలైన ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల వినియోగంలో నిర్లక్ష్యం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, అలాగే నిర్లక్ష్యంగా పొగ త్రాగడం వల్ల సంభవించే ప్రమాదాలపై ప్రజలకు వివరంగా అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు, సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు నివారణ చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి అనే అంశాలపై ప్రదర్శనలు ఇచ్చి ప్రజలకు చైతన్యం కలిగించారు. ఈ సందర్భంగా పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేసి ప్రతి ఇంటికి అగ్ని భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని అగ్నిమాపక అధికారి శ్రీ చి. జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఫైర్ ఫైటర్లు జి. అన్నమయ్య, ఎం.డి. అజ్మీర్ పాషా, కె. గోపాల్, టి. శ్రీకాంత్, పి. ప్రశాంత్ పాల్గొని విజయవంతంగా నిర్వహించారు. ప్రజలు అగ్నిప్రమాదాల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని గుర్తుంచుకోవాలని అధికారులు సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో మరణించిన మహ్మద్ జావేద్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాళులు



ఖమ్మం, ఏప్రిల్ 16( ప్రజా కలం న్యూస్ )

సూర్యాపేట సమీపంలో నిన్న జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ జావేద్ పార్థివదేహానికి రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఖమ్మం పట్టణం రెడ్ హిల్స్‌లోని ఆయన స్వగృహానికి చేరుకుని నివాళులర్పించారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జావేద్ కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖాన్ని పంచుకున్నారు. మహ్మద్ జావేద్ కాంగ్రెస్ పార్టీకి చేసిన అమోఘ సేవలు, పార్టీ బలోపేతానికి ఆయన అందించిన అపార కృషి, సామాజిక కార్యక్రమాల్లో ఆయన చురుకైన పాత్రను గుర్తు చేసుకున్న మంత్రి భావోద్వేగాలతో కన్నీరు పెట్టారు. "జావేద్ లాంటి సీనియర్ నాయకుడిని కోల్పోవడం కాంగ్రెస్ పార్టీకి, ఖమ్మం ప్రజలకు దారుణ నష్టం. ఆయన సేవలు ఎప్పటికీ మరచిపోలేని వాటిగా ఉంటాయి" అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్లు, మేయర్, కార్పొరేటర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు జావేద్ పార్థివ దేహానికి నివాళులర్పించి ఆయన్ని వియర్పించుకున్నారు. మహ్మద్ జావేద్ ఖమ్మం కాంగ్రెస్ పార్టీలో దీర్ఘకాలం నుంచి క్రియాశీలుడుగా, నాయకుడిగా పనిచేసినవారు. ఆయన మరణం పార్టీలో భారీ శోకాన్ని కలిగించింది.

## రోడ్డు ప్రమాదంలో దుర్మరణం:
# సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జావేద్‌కు ప్రజా కలం రిపోర్టర్ భాగ్యరాజ్ నివాళులు.

ఖమ్మం, ఏప్రిల్ 16( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం నగరంలో గురువారం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పొందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ జావేద్‌కు స్థానిక పత్రిక, ప్రజా కలం రిపోర్టర్ చెవుల భాగ్యరాజ్ గొప్ప నివాళులర్పించారు. రఘునాథపాలెం ప్రాంతంలోని ప్రముఖ రిపోర్టర్‌గా పేరుగాంచిన భాగ్యరాజ్, జావేద్ మరణాన్ని తీవ్ర దిగ్భ్రాంతిగా వ్యక్తం చేస్తూ, అతని సేవలను స్మరించుకున్నారు. ఖమ్మం నగరంలో గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ జావేద్ మరణించారు. పార్టీలో దీర్ఘకాలం నుంచి ఉజ్వలంగా కొనసాగిన జావేద్, స్థానిక సమాజంలో గొప్ప పాత్ర పోషించారు. ఈ ప్రమాదం ఖమ్మం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర ఆందోళన కలిగించింది. రఘునాథపాలెం రిపోర్టర్ చెవుల భాగ్యరాజ్, ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి, జావేద్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. "జావేద్ పార్టీకి, ప్రజలకు అమూల్యమైన నాయకుడు. ఈ దుర్ఘటన అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది" అని భాగ్యరాజ్ తెలిపారు. ఈ సంఘటనపై స్థానిక ప్రజలు కూడా తీవ్ర దుఃఖం వ్యక్తం చేస్తున్నారు.



పోలీసులు ప్రమాదానికి కారణాలు ఆరా తీస్తున్నారు. రోడ్డు భద్రతపై ఇక్కడ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జావేద్ మరణంతో కాంగ్రెస్ పార్టీలో శోకాందోళన వాతావరణం నెలకొంది.

## మాజీ వార్డ్ మెంబర్ ను పరామర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

(వరంగల్ /పర్వతగిరి) ఏప్రిల్ 16, ప్రజాకలం ప్రతినిధి పర్వతగిరి మండల కేంద్రంలోని దేవిలాల్ తండాకు చెందిన మాజీ వార్డు సభ్యులు గుగులోత్ భాస్కర్ నాయక్ రోడ్డు ప్రమాదానికి గురై నర్సంపేట లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్. పార్టీ పరంగ, ప్రభుత్వం పరంగ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ పరామర్శలో పార్టీ సీనియర్ నాయకులు గుగులోతు యాకూబ్, భాస్కర్ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.



## భూపాలపల్లి డిసిసి కార్యదర్శిగా ఇందారపు చంద్రయ్య నియామకం



మల్హర్, ఏప్రిల్ 16 ప్రజాకలం ప్రతినిధి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా మల్హర్ మండలానికి చెందిన సీనియర్ నాయకులు ఇందారపు చంద్రయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కర్ణకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి చంద్రయ్య అందిస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతను అప్పగించినట్లు అధ్యక్షులు పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిపిసిసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు, ట్రైడ్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి కి, జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణకర్ కు, సర్పంచ్ బండి స్వామి, మాజీ సర్పంచ్ దన్నపనేని అశోక్ రావు, ఉప సర్పంచ్ బొబ్బిలి రాజు గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు కేసారపు చంద్రయ్య కు అలాగే పార్టీ ముఖ్య నాయకులకు చంద్రయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రమశిక్షణతో మెలుగుతూ, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. చంద్రయ్య నియామకం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అడవుల సంరక్షణ పై ఉపాది కూలీలకు అవగాహన : ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్

మల్హర్, ఏప్రిల్ 16 ప్రజాకలం ప్రతినిధి మండల కేంద్రమైన తాడిచెర్ల పంచాయతీ పరిధిలోని శాత్రాజ్ పల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్



లక్ష్మణ్ హాజరై, వేసవి కాలంలో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణ కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అడవులను కాపాడాలని సూచించారు. అడవుల్లో మంటలు చెలరేగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది మరియు ఉపాధి కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హాసన్ పర్తిలో వరంగల్ DCCB నూతన శాఖ త్వరలో ప్రారంభం




హనుమకొండ ఏప్రిల్ 16 ప్రజా కలం ప్రతినిధి

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు హాసనపర్తి నూతన శాఖ,హాసన్ పర్తి లోని PACS హాసనపర్తి భవనములో త్వరలో ప్రారంభం కానుంది. ఈ నూతన శాఖ ప్రారంభంతో హాసన్ పర్తి మండలంతో పాటు సమీప గ్రామాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలు మరింత చేరువ అవుతాయి. ఇప్పటి వరకు బ్యాంకింగ్ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా,ఇకపై స్థానికంగానే సేవలు పొందే వీలుంటుంది. ప్రత్యేకంగా రైతులకు పంట రుణాలు,పశుసంవర్ధక రుణాలు,స్వయం ఉపాధి రుణాలు అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. అదనంగా సేవింగ్స్ ఖాతాలు,ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డిజిటల్ బ్యాంకింగ్ వంటి సేవలు కూడా అందించనున్నారు. సభ్యులు మరియు ఖాతాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని బ్యాంకు అధికారులు సూచించారు. స్థానిక సహకార సంఘాలతో కలిసి పనిచేయడం ద్వారా ఈ శాఖ గ్రామీణాభివృద్ధికి దోహదపడనుంది. ఈ శాఖ ప్రారంభం హాసనపర్తి ప్రాంతానికి ఆర్థిక పరంగా కొత్త ఊపుని తీసుకురానుందని ఆశిస్తున్నారు.

# పెరుగుతున్న ఊపిరితిత్తుల, వంశపారంపర్య క్యాన్సర్ల ముప్పు

## - ముందస్తు స్క్రీనింగ్,అత్యాధునిక చికిత్సలు




హనుమకొండ ఏప్రిల్ 16 ప్రజా కలం ప్రతినిధి

ఊపిరితిత్తుల క్యాన్సర్ అంటే కేవలం ధూమపానానికి మాత్రమే సంబంధించిందని భావించేవారు కానీ, ప్రస్తుతం ధూమపానం చేయని వారిలో మరియు యువతలో కూడా ఈ వ్యాధి ఎక్కువగా నిర్ధారణ అవుతుండటం వైద్య నిపుణులలో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీనితో పాటు, జన్యుపరమైన కారణాల వల్ల వచ్చే వంశపారంపర్య క్యాన్సర్లు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఇవి తరచుగా వ్యాధి తీవ్రమయ్యే దశ వరకు గుర్తించబడవు. మారుతున్న జీవనశైలి,పర్యావరణ కారకాలు మరియు జన్యు ఉత్పరివర్తనలు ఈ వ్యాధుల పెరుగుదలకు కారణమవుతున్నాయని సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణులు చెప్పారు. దీనివల్ల అవగాహన,ముందస్తు గుర్తింపు మరియు సరైన సమయంలో చికిత్స అందడం గతంలో కంటే ఇప్పుడుమరింత కీలకంగా మారింది. ఆంకాలజీ విభాగంలో వస్తున్న అధునాతన పద్ధతులు క్యాన్సర్ నిర్ధారణ మరియు చికిత్సలో,ముఖ్యంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలో గణనీయమైన మార్పులు తీసుకువచ్చింది. నెక్స్ట్-జనరేషన్ సీక్వెన్సింగ్,పాలిమరేజ్ చైన్ రియాక్షన్ వంటి అత్యాధునిక రోగనిర్ధారణ సాధనాలు ఇప్పుడు క్యాన్సర్ వ్యాప్తికి కారణమయ్యే జన్యు ఉత్పరివర్తనలను ఖచ్చితంగా గుర్తించడానికి వీలు కల్పిస్తున్నాయి. ఈ సాంకేతికతలు ముందస్తు గుర్తింపులో సహాయపడటమే కాకుండా,వ్యక్తిగతీకరించిన చికిత్స ప్రణాళికలను రూపొందించడంలో మార్గనిర్దేశం చేస్తాయి. 'లిక్విడ్ బయాప్సీ'అని పిలువబడే ఒక సాధారణ రక్త పరీక్ష,మినిమల్లీ ఇన్వాసివ్ మరియు సమర్థవంతమైన స్క్రీనింగ్ సాధనంగా ఉద్భవిస్తోంది. ఇది జన్యుపరమైన ముప్పు ఉన్న కుటుంబ సభ్యులకు ముందస్తు స్క్రీనింగ్ మరియు నివారణ సంరక్షణను అందించడానికి సహాయపడుతుంది. తీవ్రమైన దశలో ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స పద్ధతులు ఇప్పుడు సాధారణ కీమోథెరపీకి మించి అభివృద్ధి చెందాయి. నేడు,టార్గెటెడ్ థెరపీ మరియు ఇమ్యునోథెరపీలు పేషెంట్ల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తూ కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి. టార్గెటెడ్ థెరపీ నిర్దిష్ట జన్యు ఉత్పరివర్తనాలపై దృష్టి సారిస్తుంది,కాగా ఇమ్యునోథెరపీ క్యాన్సర్ కణాలతో మరింత సమర్థవంతంగా పోరాడటానికి శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. సాంప్రదాయ చికిత్సలు పరిమితంగా ఉన్న తీవ్రమైన దశలలోఈ చికిత్సలు విశేషంగా ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ విషయం గురించి సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ డాక్టర్. డాక్టర్ హరీష్ కంచర్ల (కన్సల్టెంట్-సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ మరియు హెమటో-అంకాలజిస్ట్) మాట్లాడుతూ.. "ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల ప్రొఫైల్లో గణనీయమైన మార్పును మేము చూస్తున్నాము,ధూమపానం చేయని వారు,యువకులు కూడా ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. ముఖ్యంగా వంశపారంపర్య క్యాన్సర్లలో జన్యుపరమైన కారకాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్జీఎస్ మరియు పీసీఆర్ వంటి అధునాతన నిర్ధారణ పద్ధతులు,టార్గెటెడ్ థెరపీ మరియు ఇమ్యునోథెరపీ వంటి చికిత్సలు అందుబాటులోకి రావడంతో,మేము ఇప్పుడు మరింత వ్యక్తిగతీకరించిన మరియు సమర్థవంతమైన చికిత్సలను అందించగలుగుతున్నాము. ముఖ్యంగా,సాధారణ రక్త పరీక్షల ద్వారా ముందస్తు స్క్రీనింగ్ చేయడం వలన లక్షణాలు కనిపించకముందే ముప్పు పొంచి ఉన్న వ్యక్తులను గుర్తించవచ్చు, ఇది చికిత్స ఫలితాలను గణనీయంగా మెరుగుపరుస్తుంది.''అని అన్నారు. సమగ్రమైన,వ్యక్తిగతీకరించిన చికిత్సను అందించడానికి అత్యాధునిక సాంకేతికతలను నిపుణులైన క్లినికల్ నైపుణ్యంతో సమన్వయం చేస్తూ యశోద హాస్పిటల్స్ క్యాన్సర్ సంరక్షణలో అగ్రగామిగా కొనసాగుతోంది. వంశపారంపర్య క్యాన్సర్ల పట్ల అవగాహన పెంచాలని హాస్పిటల్ సూచిస్తోంది. కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్న వ్యక్తులు సకాలంలో స్క్రీనింగ్ మరియు జన్యుపరమైన కౌన్సెలింగ్ చేయించుకోవాలని ప్రోత్సహిస్తోంది, ఇది ముందస్తు గుర్తింపు మరియు నివారణలో కీలక పాత్ర పోషిస్తుంది. మరింత సమాచారం కోసం, దయచేసి సంప్రదించండి. సంజీవ్ కుమార్ పి అసిస్టెంట్ మేనేజర్ 7337356726 యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గత మూడు దశాబ్దాలుగా వైవిధ్యమైన వైద్య అవసరాలు కలిగిన ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందిస్తోంది. సమర్థవంతమైన నాయకత్వం మరియు బలమైన యాజమాన్యం కింద,యశోద గ్రూప్ అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య చికిత్సను అందించే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ఎదిగింది. పేషెంట్ల అవసరాలకు అనుగుణంగా,అరుదైన మరియు క్లిష్టమైన ప్రక్రియల కోసం సైతం విప్లవాత్మక సాంకేతికతను ఉపయోగిస్తూ,యశోద గ్రూప్ ప్రతి వైద్య విభాగంలోనూ అత్యాధునిక రోగనిర్ధారణ మరియు చికిత్సా సేవలను అందిస్తోంది. హైదరాబాద్లోని యశోద హాస్పిటల్స్కు సోమాజిగూడ, సికింద్రాబాద్,మలక్పేట్,హైటెక్ సిటీలలో 4 స్వతంత్ర ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో మొత్తం 4000 బెడ్ల సామర్థ్యం ఉంది. నాణ్యత, అద్భుతమైన సేవలు మరియు పేషెంట్ల పట్ల సానుభూతిని నిరంతరం కొనసాగిస్తూ,యశోద గ్రూప్ ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలను తక్కువ ధరలకే అందిస్తోంది. ఇందులో భాగంగానే అత్యాధునిక మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సలను సైతం సామాన్యులకు అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు.

# మహిళ,సాధికారత, గ్రామాల అభివృద్ధి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ధ్యేయం

### - ప్రగతి ప్రణాళికతో గ్రామాల్లో చైతన్యం - జనగణమన గీతాలాపన, మత్తు పదార్థల నిర్మూలనకై ప్రతిజ్ఞ - ఎమ్ ఆర్ ఓ విజయ్ సాగర్.యస్ ఐ సాయి బాబు - జెడ్పి సి ఈ ఓ రామ్ రెడ్డి



ఏప్రిల్ 16 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్ /వర్దన్నపేట)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, అవగాహనకు కొత్త ఊపిరి పోస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా వర్దన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశం ప్రజల్లో విశేష స్పందన రేకెత్తించింది. మహిళ సాధికారత, రైతు సంక్షేమం, యువత భవిష్యత్ వంటి కీలక అంశాలపై అధికారులు సమగ్రంగా అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ సీఈఓ రాంరెడ్డి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు రుణ సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా గ్రామీణ మహిళలను వ్యాపార రంగంలో ముందుకు తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి మహిళ కుటుంబానికి ఆదారంగా నిలిచేలా చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ రంగంపై మాట్లాడుతూ, వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ రైతు బంధు, రైతు భీమా పథకాల ప్రయోజనాలను వివరించారు. ఎకరాకు 12,000 ఆర్థిక సహాయం, ప్రమాద సమయంలో 5 లక్షల భీమా రైతులకు భరోసానిస్తోందన్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచిస్తూ, ఎకరాకు 51,000 సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. దిగుమతులపై ఆధారాన్ని తగ్గించేందుకు ఆయిల్ పామ్ పంటలు కీలకమని వివరించారు. మండల ఎంపీడీఓ వెంకటరమణ మాట్లాడుతూ మహిళలు, రైతులు, పేద కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను స్పష్టంగా తెలియజేశారు. వీడియో ప్రదర్శన ద్వారా పథకాల అమలు విధానాన్ని సులభంగా అర్థమయ్యేలా వివరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువత భవిష్యత్‌పై దృష్టి సారిస్తూ ఎస్ఐ సాయి బాబు కీలక సూచనలు చేశారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. శబ్ద కాలుష్యం కలిగించే వాహనాల వినియోగాన్ని తగ్గించాలని, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో యువత పాత్ర కీలకమని అన్నారు. కార్యక్రమంలో యస్ ఐ ప్రజల చేత జనగణమన గీతాలాపన చేసిన అనంతరం మత్తు పదార్థల నిర్మూలన అవగాహనపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశం ద్వారా గ్రామ ప్రజల్లో ప్రభుత్వ పథకాలపై విశ్వాసం పెరిగిందని, మహిళ సాధికారత దిశగా ముందడుగు పడిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. విద్య, వైద్యం, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖలకు చెందిన అధికారులు తమ సేవలపై వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఆర్వో విజయ్ సాగర్, ఏఎంసీ చైర్మన్ నరకుడు వెంకటయ్య, మండల ప్రత్యేక అధికారి రమేష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికతో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతోందని స్పష్టమవుతోంది. మహిళ సాధికారత, రైతు సంక్షేమం, యువత మార్గదర్శకత్వం- ఈ మూడు సూత్రాలతో గ్రామాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా తెలంగాణ ముందుకు సాగుతోంది.

## మల్హార్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశం

### - పీహెచ్‌సీని సీఎస్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని మాజీ ఎంపీపీ డిమాండ్
### - ఓసీపీ డేంజర్ జోన్ సర్వేపై నిర్వాసితుల ఆగ్రహం

మల్హార్, ఏప్రిల్ 16 ప్రజాకలం ప్రతినిధిమండల కేంద్రమైన తాడిచర్లలోని రైతు వేదికలో గురువారం 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి జె. బాపు పర్యవేక్షణలో, ఇంచార్జి ఎంపీడీఓ శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రభుత్వ పథకాల అమలు తీరును, లబ్ధిదారుల వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహల్ రావు మాట్లాడుతూ.. స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా అప్‌గ్రేడ్ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. అనంతరం తాడిచర్ల టీఎస్ జెన్కో ఓసీపీ 500 మీటర్ల డేంజర్ జోన్ పరిధిలోని నిర్వాసితుల సమస్యలను బండి సుధాకర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వే తప్పుల తడకగా ఉందని, ఎవరి ఆదేశాలతో ఇటువంటి నివేదికలు తయారు చేశారని ఆయన నిలదీశారు. స్థానిక నిర్వాసితులకు న్యాయం జరగని పక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమవుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బండి స్వామి, జంగిడి శ్రీనివాస్, బండారి నర్సింగం, కొండ రాజమ్మ, గడ్డం క్రాంతి, మేకల రాజయ్య యాదవ్, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు

(వరంగల్ / పర్వతగిరి)ఏప్రిల్ 16, ప్రజాకలం ప్రతినిధి.

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం గ్రామంలో పల్లవి మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా విద్యార్థులు అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి గ్రామ ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ ర్యాలీ లో విద్యార్థులు నినాదాలతో ప్లకార్డులు పట్టుకొని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేపట్టినారు. అలాగే హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, అధిక వేగాన్ని నివారించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని ప్రజలకు తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని విజ్ఞప్తి చేశారు. ర్యాలీ అనంతరం విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేసి గ్రామ ప్రజలతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై పాటలు పాడి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్నారం గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్, వార్డ్ మెంబర్ గాడిపెల్లి రాజబాబు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక్ చారి, కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్ లు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులచే రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులకు వ్యాస రచన, విద్యార్థులచే తల్లిదండ్రులకు ఉత్తరాలు రాయించడం జరిగింది. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించడం అలాగే పల్లవి పాఠశాలలో ప్రతి సంవత్సరం రెండు మార్లు ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తామని రోడ్డు ప్రమాదాల నివారణలో తమవంతు భాధ్యతగా చొరవ తీసుకుంటామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఖాకీల మమకారం.. పోలీస్ స్టేషన్ నే పుట్టిల్లుగా!

## - జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో అపూర్వ ఘట్టం
## - మహిళా కానిస్టేబుల్‌కు సీమంతం
## - తండ్రి స్థానంలో నిలిచిన ఎస్‌హెచ్‌ఓ.. కుటుంబ సభ్యులుగా మారిన సిబ్బంది



ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) అమ్మానాన్నల పేగుబంధం లేకపోయినా.. తోటి సిబ్బందే అన్నాచెల్లెళ్లుగా, పై అధికారి పెద్దదిక్కుగా మారి ఆ మహిళా కానిస్టేబుల్‌కు మాతృమూర్తి అయ్యే ఆనందాన్ని ద్విగుణీకృతం చేశారు. కన్నవాళ్ల లేని లోటు ఏమాత్రం తెలియకుండా, పుట్టింటి బాధ్యతను భుజానికెత్తుకుని పోలీస్ స్టేషన్‌నే వేదికగా మార్చి అత్యంత ఘనంగా ఆమెకు సీమంతం నిర్వహించారు. ఖాకీ దుస్తుల వెనుక దాగి ఉన్న కల్మషం లేని కరుణను, ఆత్మీయతను చాటిన ఈ అపూర్వ ఘట్టం జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో జరిగింది. జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సవిత కానిస్టేబుల్‌కు తల్లిదండ్రులు చిన్నప్పుడే దూరమయ్యారు. ఇటీవల ఆమె గర్భం దాల్చారు. సాధారణంగా కన్నవాళ్లు ఉంటే బిడ్డకు ఎంతో అల్లారుముద్దుగా, బంధుమిత్రుల నడుమ ఘనంగా సీమంతం జరిపిస్తారు. తనకు ఆ భాగ్యం లేదని ఆమె మనసులో ఉన్న చిన్న బాధను గ్రహించిన జీడిమెట్ల ఎస్‌హెచ్‌ఓ (సీఐ) గడ్డం మల్లేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. స్టేషన్‌నే ఆ మహిళా కానిస్టేబుల్ కు పుట్టిల్లుగా మార్చారు. తానే స్వయంగా ఓ తండ్రి పాత్రను పోషించి, వేడుకకు అన్నీ తానై వ్యవహరించారు.

పోలీస్ స్టేషన్ లోనే పండుగ వాతావరణం..

తోటి మహిళా పోలీసు సిబ్బందితో పాటు స్టేషన్‌లోని అధికారులంతా ఒకే కుటుంబంగా మారారు. హోదాలను పక్కనపెట్టి ఒక్కటయ్యారు. పోలీస్ స్టేషన్ లోనే పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీర గాజులు, స్వీట్లు అన్నీ తీసుకొచ్చి పండంటి బిడ్డకు జన్మనివ్వాలని హారతులతో పాటు ఆశీస్సులు అందించి అంగరంగ వైభవంగా సీమంతం వేడుకను నిర్వహించారు. కన్నవాళ్లు ఉంటే ఏ విధంగా చేస్తారో, అంతకంటే మిన్నగా, అద్భుతంగా ఈవేడుకను జరిపించారు. మహిళా సిబ్బంది అంతా ఆమెకు పూలు పెట్టి, గాజులు తొడిగి ఆశీర్వదించారు. కదిలించిన ఎస్‌హెచ్‌ఓ (సీఐ) గడ్డం మల్లేశ్ నిత్యం నేరాలు, కేసుల విచారణలు, శాంతిభద్రతల పరిరక్షణతో బిజీగా ఉండే పోలీసులు.. తమ తోటి సిబ్బంది కోసం ఒక కుటుంబంలా మారి వేడుక నిర్వహించడం అని అందరి హృదయాలను హత్తుకుంది. "బాస్ అంటే కేవలం ఆజ్ఞలు జారీ చేసేవారే కాదు.. కష్టసుఖాల్లో అండగా నిలిచే కుటుంబ పెద్ద" అని సిఐ గడ్డం మల్లేశ్ నిరూపించారు. కన్నవాళ్లు లేని లోటును పూడ్చుతూ, కానిస్టేబుల్ మనసుకు కొండంత అండగా జీడిమెట్ల పోలీసులు సిబ్బంది నిలిచారు.



## ఆటో డ్రైవర్ చెరువులో దూకి ఆత్మహత్య

ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)ఆటో డ్రైవర్ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో, కట్ట మైసమ్మ లింగం చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యమయింది. సూరారం కాలనీ, దయానంద్ నగర్ కు చెందిన సాయిలు, వయస్సు 48, ఆటో డ్రైవర్, సొంత ఊరు ఎల్లారెడ్డి, ప్రస్తుతం సూరారం కాలనీ దయానంద్ నగర్ లో నివాసం ఉంటున్నాడు. ఒక కొడుకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అతడు ఎందుకు చనిపోయాడు బలమైన కారణాలే ఉన్న ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అతనికి ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు అవి భరించలేక ఆత్మహత్య చేసుకున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## యాదాద్రిశుడికి నిత్య పూజలు.

### స్వామివారి నిత్య రాబడి. రూ.12.82 లక్షలు.

యాదగిరిగుట్ట : ఏప్రిల్ 16 ప్రజా కలం ప్రతినిధి:

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య క్షేత్రంలో ఆలయ అర్చకులు నిత్య ఆరాధనలు నిర్వహించారు. గురువారం స్వామివారి దర్శనానికి



కుటుంబ సభ్యులతో వచ్చిన భక్తులు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో జరిగే సువర్ణ పుష్పార్చన నిత్య కళ్యాణం వేద ఆశీర్వచనం సాయంత్రం జరిగిన వెండి మొక్కు జోడి సేవలు కొండకిందగల సత్యనారాయణ స్వామి వ్రతాలలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కొండపైన అనుబంధాలయమైన శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకుని మొక్కు బడులు చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన పాత గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నిత్య రాబడిలో భాగంగా గురువారం రోజున రూ.12,82,284,వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు మంగళగిరి నరసింహమూర్తి, ప్రశాంత్ చార్యులు రామాచార్యులుఇన్చార్జి వెంకటేష్ ఎస్పీఎఫ్ సిబ్బంది మాణిక్ ప్రభు మోహన్ రెడ్డి పాండు సూర్య నాయక్, దేవస్థాన సిబ్బంది కుమార్ భక్తులు పాల్గొన్నారు.

## భక్తునికి మొబైల్ ఫోన్ అప్పజెప్పిన సెక్యూరిటీ సిబ్బంది శేఖర్

యాదగిరిగుట్ట : ఏప్రిల్ 16 ప్రజా కలం ప్రతినిధి:



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయానికి దర్శనార్థం వచ్చిన హైదరాబాద్ కు చెందిన మహేష్ దర్శనం వెళ్లే సమయంలో కొండపైన బస్ స్టాప్ లో తన మొబైల్ ఫోను మర్చిపోయాడు. కొండపైన బస్ స్టాప్ లో అక్కడే విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది శేఖర్ ఆ మొబైల్ ఫోను గమనించి మైక్ లో అనౌన్స్ చేపించి భక్తుని వివరాలు తెలుసుకొని భక్తునికి అప్పజెప్పాడు. భక్తునికి తన మొబైల్ ఫోను తిరిగి ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశాడు. అనంతరం శేఖర్ ను ఆలయ అధికారులు ఎస్పీఎఫ్ అధికారులు తోటి సిబ్బంది భక్తులు పలువురు అభినందించారు.

## బైక్ ఢీకొని గొర్రెల కాపర్ కి తీవ్ర గాయాలు

వలిగొండ ఏప్రిల్ 16 ప్రజాకలం:బైక్ ఢీకొని గొర్రెల కాపరికి తీవ్రంగా గాయపడిన ఘటన వలిగొండ మండలంలోని నాగారం గ్రామ పరిధిలో



గురువారం చోటుచేసుకుంది.108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.మండల పరిధిలోని గోల్నేపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల నరసింహ నాగారం గ్రామంలో గొర్రెలను మేపుకొని గొల్లపల్లి గ్రామానికి తిరిగి వెళుతుండగా,నాగారం నుండి చౌటుప్పల్ వైపు బైక్ మీద వెళ్తున్న వ్యక్తి గొర్రెల కాపరిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు.తీవ్రంగా గాయపడిన గొర్రెల కాపరిని చికిత్స నిమిత్తం108 వాహనంలో రామన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## ప్రతిభావంతులైన ఇంటర్ విద్యార్థులకు ఘన సన్మానం

### పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి:బాలానగర్ సిఐ నర్సింహా రాజు




ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ సైబరాబాద్ కమిషనరేట్ పరిధి బాలానగర్ పోలీసులు ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఈకార్యక్రమంలో బాలానగర్ సీఐ నర్సింహరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జి.లక్ష్మి నిత్యానంద్ గౌడ్ (శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, కూకట్పల్లి), బి. ఎన్.సాత్విక్ (నారాయణ జూనియర్ కాలేజ్, కూకట్పల్లి), ఒమేరా మెహ్రీన్ (శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, కూకట్పల్లి), పూజిత(శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, హబ్సిగూడ), షైక్ సానియా సభహ్(ఫిజిక్స్ వాలా జూనియర్ కాలేజ్), ఎమ్.అక్షర(శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, మియాపూర్) లను శాలువాలతో సత్కరించి, మొమెంటో అందజేసి, వారి భవిష్యత్ అవసరాల కోసం నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈసందర్భంగా సిఐ నర్సింహా రాజు మాట్లాడుతూ.... మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవడం ద్వారా సమాజంలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఈసందర్భంగా ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పోటీ ప్రపంచంలో నెగ్గాలి:ఎస్ఐ సరిత రెడ్డి అనంతరం ఎస్ఐ సరిత రెడ్డి ప్రసంగిస్తూ... విద్యార్థులు చెడు అలవాట్లకు, ఆకర్షణలకు లోనుకాకుండా కేవలం భవిష్యత్తుపైనే దృష్టి సారించాలని కోరారు. "పూర్వం చదువుకోవడానికి సరైన వసతులు ఉండేవి కావు. నేడు పరిస్థితులు మారాయి. తమకు తిండి లేకపోయినా పర్వాలేదు. పిల్లలకు నాణ్యమైన చదువు అందాలని తల్లిదండ్రులు తపన పడుతున్నారు. వారి కష్టాన్ని వృధా చేయకుండా ప్రభుత్వ, కార్పొరేట్ రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆయన హితవు పలికారు.పోలీస్ శాఖ తరపున జరిగిన ఈ అభినందన కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈకార్యక్రమంలో డిఐ సక్రమ్, ఎస్ఐలు సరిత రెడ్డి, హాజీమియా, వినోద్ కుమార్, ఏఎస్ఐ హనుమయ్య పలువురు పోలీస్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ సభ్యులకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయి:కూన




ప్రజాకలం/కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) కైసర్ నగర్ వాసవి క్లబ్ వనిత వీరభద్ర అసోసియేషన్ ప్రమాణస్వీకార మహోత్సవంలో ముఖ్యఅతిథిగా మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి వైస్ ప్రెసిడెంట్ కూన శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

గాజులరామారం డివిజన్ పరిధిలోని కైసర్ నగర్ వాసవి క్లబ్ వీరభద్ర నూతన కమిటీ అధ్యక్షురాలుగా భవానిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆమె ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ మల్కాజ్గిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై

మాట్లాడుతూ... ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుంటారని, అదేవిధంగా కష్టం వస్తే కుల మతాలకు అతీతంగా సహాయ సహకారాలు అందిస్తారని తెలియజేశారు, అదేవిధంగా మా యొక్క సహాయ సహకారాలు ఎల్లప్పుడూ వాసవి క్లబ్ అసోసియేషన్ వారికి ఉంటాయని తెలిపారు. అదేవిధంగా నూతన అధ్యక్షురాలుగా ఎన్నికైన భవాని వారి కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు.అనంతరం నూతన అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులకు కూన శ్రీనివాస్ గౌడ్ శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు సముద్రాల కృష్ణమూర్తి, ప్రదీప్ కుమార్ మరియు కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, తోసిపు తదితరులు పాల్గొన్నారు.



## చేనేత కార్మికులు వైద్య శిబిరాలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు......

యాదాద్రి భువనగిరి: ఏప్రిల్ 16 ప్రజా కలం ప్రతినిధి :

జిల్లా లో ఉన్న చేనేత కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వైద్య శిబిరాలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం ఆలేరు పట్టణంలోని గౌడ సంఘ భవనంలో చేనేత కార్మికులకు "ఆరోగ్య భరోసా" కార్యక్రమాన్ని ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాలమణి భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచనలతో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. చేనేత కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సలు, ల్యాబ్ పరీక్షలు అందించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని చికిత్స తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆంజనేయులు, డిఆర్ డిఏ పిడి నాగి రెడ్డి, శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మునిసిపల్ కౌన్సిలర్లు, పట్టణ చేనేత సంఘం సభ్యులు, ఆరోగ్య సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నీరుడు నర్సింగ్ రావుకు దళితరత్న అవార్డు ప్రధానం..

ఉప్పల్ ఎప్రిల్ 16 (ప్రజాకలం న్యూస్)

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్‌హౌకులాల అభివృద్ధి శాఖహౌఆధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తాలో జరిగిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బిఆర్. అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమంలో ఉప్పల్ నివాసి నీరుడు నర్సింగ్ రావుకు ప్రతిష్టాత్మకమైన దళితరత్న అవార్డు ప్రదానం చేశారు.హౌహౌ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేంద్రరెడ్డీ,ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్ చేతుల మీదుగా అవార్డును అందజేసారు.రెవెన్యూ శాఖలో సుధీర్ఘ కాలం వివిధ హోదాల్లో విధులు నిర్వహించి, అంబేద్కర్ స్ఫూర్తితో సహచర ఉద్యోగుల హక్కులకై పోరాడారు. అంబేద్కర్ భావజాల వ్యాప్తికై పరితపించే వారు. ఉప్పల్ మాల బస్తీలో దళితుల ఐక్యత కోసం కృషి చేశారు. విద్యతోనే అభివృద్ధి, మార్పు సాధ్యమని యువతకు సూచించే వారు. తన సేవలను గుర్తించి దళితరత్న అవార్డ్ ప్రధానం చేసిన అధికారులకి, సహకరించిన నాయకులకు నర్సింగరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారిక యంత్రాంగం, దళిత నేతలు మాస శేఖర్, నీరుడు అంజన్ కుమార్, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు

**- వాక్సెన్ యూనివర్సిటీ, సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీజీపీ.**

**- ట్రాఫిక్ నియమాలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ మెలకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్,**




సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 16 (ప్రజా కలం ) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా నాలుగో రోజు (ఏప్రిల్ 16) వాక్సెన్ యూనివర్సిటీ, సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, ఐపీఎస్ హాజరైనట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే ఉద్దేశంతో వారం రోజుల పాటు "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ నియమాలపై అవగాహన తప్పనిసరి అని అన్నారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ గురించి వివరిస్తూ, డ్రైవర్ ముందుగా తన వాహనం పరిస్థితి గురించి తెలుసుకుని ఉండాలని, ప్రయాణించే రహదారి పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. వాహనాన్ని ఎంత వేగంగా నడుపుతున్నామన్నది కాదు, ఆ వేగాన్ని నియంత్రించగలగడం ముఖ్యమని అన్నారు. అజాగ్రత్తగా వాహనం నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని, డ్రైవింగ్ సమయంలో పూర్తి ఏకాగ్రతతో ఉండాలని, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని నివారించాలని సూచించారు. విశ్రాంతి లేకుండా నిరంతరం డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. డ్రైవింగ్‌లో ఎంత నైపుణ్యం ఉన్నా ఎదుటివారి తప్పిదాల వలన కూడా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, కాబట్టి డిఫెన్సివ్ డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్, ఐపీఎస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలకు ఎవరూ అతీతులు కాదని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించి, పరిమిత వేగంతో ప్రయాణించాలని అన్నారు. అతివేగం క్షణిక ఆనందాన్ని కలిగించినప్పటికీ, ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. గమ్యాన్ని చేరుకోవడం ఎంత ముఖ్యమో, సురక్షితంగా చేరుకోవడం అంతకంటే ముఖ్యమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి వెంటనే సహాయం చేసే వ్యక్తులను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాహ్ వీర్ పథకం ఒక ముఖ్యమైన రోడ్డు భద్రత కార్యక్రమమని తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే (గోల్డెన్ అవర్ -- మొదటి 60 నిమిషాలు) బాధితుడికి సహాయం చేసి ఆసుపత్రికి చేర్చిన వ్యక్తిని "రాహ్ వీర్" అని పిలుస్తారని చెప్పారు. అటువంటి వ్యక్తులకు ప్రభుత్వం తరపున రూ. 5,000 వరకు నగదు బహుమతి అందజేస్తారని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదం లేదా హార్ట్ అటాక్ జరిగినప్పుడు కృత్రిమ శ్వాస అందించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. అనంతరం నేను ట్రాఫిక్ నియమాలను పాటిస్తాను అని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ మహిళా కానిస్టేబుల్ ఇందిరా, డిఫెన్సివ్ డ్రైవింగ్ గురించి వివరిస్తూ, డిఫెన్సివ్ డ్రైవింగ్ ఎలా చేయాలి, రోడ్డు ప్రమాదాలను ఎలా నివారించాల అనే విషయాలను స్పష్టంగా, సులభంగా అర్థమయ్యేలా వివరించారు. వాక్సెన్ యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ సేఫ్టీ హెల్మెట్ గురించి యాజమాన్యం వివరిస్తూ, ప్రమాదం లేదా అనుకోని పరిస్థితుల్లో హెల్మెట్‌లో అధిక ఉష్ణోగ్రత (హీట్) ఉత్పత్తి అయితే సెన్సార్ ఆక్టివేట్ అయ్యి హెల్మెట్ చల్లబడే విధంగా పనిచేస్తుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం చేరే విధంగా ఇది పనిచేస్తుందని, ప్రమాదం జరిగిన సమయంలో వాహనం వేగం ఎంత ఉందో కూడా నమోదు అవుతుందని చెప్పారు. మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు ఎస్ఓఎస్ సౌకర్యం కూడా ఇందులో కల్పించబడిందని తెలిపారు.

బస్సుల్లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు, పొగ గుర్తించిన వెంటనే సెన్సార్ ఆక్టివేట్ అయ్యి పొగను బయటకు పంపించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా అగ్ని ప్రమాదం సమయంలో ప్రయాణికులు సులభంగా బయటపడేందుకు ఆటోమేటిక్ గ్లాస్ బ్రేకింగ్ సిస్టమ్ కూడా అందుబాటులో ఉన్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో వాక్సెన్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లూరు రామకృష్ణ వర్మ, డైరెక్టర్ సెక్యూరిటీ శశికాంత్ ఉపాధ్యాయ్ (రిటైర్డ్ ఐజీ), డీన్ -- స్కూల్ ఆఫ్ లా డా. ఎ. శ్రీలత, డీన్ -- స్కూల్ ఆఫ్ సైన్స్ డా. దయాశంకర్, అసోసియేట్ డీన్ డా. బ్యూటీ పాండే, రిజిస్ట్రార్ శ్రీ అభిజీత్ శిరోద్కర్, డీన్ -- ఆర్కిటెక్చర్ సోనియా గుప్తా, హెడ్ ఆఫ్ సెక్యూరిటీ డా. ఏవీఎస్ శ్రీధర్, సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, ఇన్స్పెక్టర్ సుమన్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్, ఎస్ఐ రాజేష్ నాయక్, కావేరి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి.

**ముఖ్య ప్రణాళిక నోడల్ అధికారి బాబు నాయక్.**



సిద్దిపేట ప్రజాకలం ఏప్రిల్ 16.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఇంటికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్య ప్రణాళిక నోడల్ అధికారి బాబు నాయక్ అన్నారు. గురువారం రాయపోల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్ఐ మానస, ఏఎంసీ చైర్మన్ కనకయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, సన్నరకం వరి బోనస్, చేయూత పెన్షన్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మహిళా శక్తి బ్యాంక్ లింకేజ్ రుణాలు, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే స్థానిక సమస్యలు, అభివృద్ధి అవసరాలను గుర్తించి ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాలన్నారు. ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీల అమలుకు జిల్లాలో రూ.1000 కోట్లకు పైగా ఖర్చు - కలెక్టర్ హైమావతి.

సిద్దిపేట ప్రజాకలం ఏప్రిల్ 16.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం కొమరవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి సభ




నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కే. హైమావతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా ప్రజల సంక్షేమం, రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 6 గ్యారంటీల అమలుకు రూ.1000 కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. జిల్లాలో 25 వేల కొత్త రేషన్ కార్డులు, 11,241 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. గ్యాస్ సబ్సిడీ, గృహజ్యోతి ఉచిత విద్యుత్, రైతు భరోసా, మహిళల ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సునీత రెడ్డి పోరాటం ఫలితమే సింగూరు నీరు విడుదల

**సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవితేజ రెడ్డి**

మెదక్ ఏప్రిల్ 16(ప్రజాకలం ప్రతినిధి) మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పోరాటం ఫలితమే నేడు సింగూరు నీరు విడుదల కావడం జరిగిందని అంతేకాకుండా ఎండిన పంటలకు ఊరట వచ్చి రైతుల్లో ఆనందం కలిగిందని కొల్చారం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవితేజ రెడ్డి అన్నారు. కొల్చారం మండలం పైతర చెక్ డాం వద్ద సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవితేజ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు గంగమ్మ తల్లికి పూలతో ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవితేజ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పోరాట ఫలితమే నేడు సింగూరు నీరు విడుదల కావడం సంతోషకరమన్నారు. సుమారు లక్ష ఎకరాలకు నీరును తీసుకురావడానికి కృషిచేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ భిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మల్లేశం, మాజీ సర్పంచ్ మురళి గౌడ్, మాజీ సర్పంచ్ సంతోష ఎల్లేశం, మాజీ ఎంపిటిసి అదం ఎల్లయ్య, ఉప సర్పంచ్ సుధాకర్, కంటే పోచయ్య, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు






## ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా చెప్పాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

మెదక్ ఏప్రిల్ 16(ప్రజాకలం ప్రతినిధి ) ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మెదక్ జిల్లా కొల్చారం మండలం లో గురువారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరై, జయ జయ హే తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. గ్రామ స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కారం అందించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొల్చారం మండల సమావేశంలో లేవనెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి విజ్ఞప్తిని ప్రాధాన్యంగా పరిగణించి, నిర్ణీత కాలంలో పరిష్కారం చూపించాలని వారు సూచించారు. గ్రామ స్థాయిలో ఎదురవుతున్న తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల సమస్యలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో కనీసం పది మంది రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు అధిక ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని వారు కోరారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, శిక్షణలు అందిస్తూ ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంలో గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని వారు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంతో పాటు, ప్రతి ఇంటికి అవగాహన కల్పించే బాధ్యత సర్పంచ్‌లపై ఉందన్నారు. ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటలపై రైతులకు ప్రోత్సాహం కల్పించి, వ్యవసాయ రంగ అభివృద్ధికి తోడ్పడాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం మండల సమాఖ్య సభ్యురాలు మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ అభివృద్ధిలో సంఘాల పాత్ర గురించి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో మహిళలు ఆర్థికంగా ముందుకు సాగుతున్నారని వారు పేర్కొన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తమకు స్థిరమైన నివాసం కలగడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఇంతకాలం ఎదుర్కొన్న గృహ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని, తమ కుటుంబాలకు భద్రతతో కూడిన జీవనం అందిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తమలాంటి పేదలకు ఇల్లు కల్పించడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సంబంధిత అధికారులు పథకం అమలులో పారదర్శకతను పాటిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్ చారి, ప్రత్యేక అధికారి జిల్లా విద్యాశాఖ అధికారి విజయ, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా బేగం, సర్పంచ్ దేవన్నగారి శేఖర్,.వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై సమీక్ష.

వలిగొండ ఏప్రిల్ 16 ప్రజాకలం:తెలంగాణ ప్రభుత్వం,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు"ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక"పై వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ప్రత్యేక అధికారి జగన్నాధ రావు హాజరయ్యారు. మార్చి 6వ తేదీ నుండి 99 రోజుల పాటు గ్రామ స్థాయి నుండి మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో, అర్హులైన లబ్ధిదారులకు అందరికీ ప్రభుత్వం అందించే పథకాలు అందినాయని ఒకవేళ ఎవరైనా పొందనియెడల వారికి కూడా తప్పకుండా అమలు చేయాలని నిర్ణయించబడింది. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటైన నాటి నుండి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పురోగతిపై ప్రతి శాఖాధికారులు తమ నివేదికలను సమర్పించారు. గ్రామ సర్పంచులు లేవనెత్తిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.జలందర్ రెడ్డి, మండల రెవెన్యూ అధికారి దశరథ్ నాయక్, మండల విద్యా అధికారి భాస్కర్, మండల పంచాయతీ అధికారి శ్రీమతి వై. ప్రేమలత, వ్యవసాయ అధికారి అంజని దేవి, వైద్య శాఖకు చెందిన డా.వేణు మాధవి, డా. జ్యోతి, డా.ఖాజా, విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ నర్సింహ, పంచాయతీ రాజ్ శాఖ సహాయ ఇంజనీర్ సందీప్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీమతి రమ్య, ఐకేపీ అసోసియేట్ ప్రాజెక్ట్ మేనేజర్ అంజయ్య, హౌసింగ్ శాఖ ఏఈ కిరణ్, అశోక్, గ్రామ పంచాయతీ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## కాకి రాజేష్ కుమార్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా

మహేశ్వరం, ఏప్రిల్ 16,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన



కార్యదర్శి షేక్ హాజీ బాబా బాల్యమిత్రుడు మహేశ్వరం వ్యాపార సముదాయ సంఘం కార్యదర్శి న్యూస్ టీవీ రిపోర్టర్ ఇంటర్నెట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముదిరాజ్ సంఘం యువ నాయకులు కాకి రాజేష్ కుమార్ గారి 37 వ పుట్టినరోజు సందర్భంగా ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మహమ్మద్ ఉస్మాన్. మహమ్మద్ రిజ్వాన్. సయ్యద్ షబాజ్ అలీ. షేక్ అబ్దుల్ రహమాన్. షేక్ అబ్దుల్ రహీం. మొహమ్మద్ ఫుర్ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వాహనదారునికి అన్ని ధృవపత్రాలు కలిగి ఉండాలి

### -ఎస్సై లవ కుమార్



సంగారెడ్డి జిల్లా వట్టిపల్లి

సంగారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 16(ప్రజా కలం): ప్రతి వాహనదారుడు వద్ద పోలీసు వారి తనిఖీ లో ధ్రువపత్రాలు కలిగి ఉండాలని వట్పల్లి ఎస్సై లవ కుమార్ చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనం ఆటో కారు ఇతర వాహన దారులు రోడ్లపై వెళ్లేటప్పుడు ఇన్సూరెన్స్ ఆర్ సి బుక్ డ్రైవింగ్ లైసెన్స్ ద్విచక్ర వాహన దారునికి హెల్మెట్ పెట్టుకోవాలని వాహనం ప్రమాదంలో సంభవించి వాహనదారులు ప్రయాణిస్తున్న వారు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఇన్సూరెన్స్ ద్వారా మరణించిన కుటుంబాలకు సహాయంగా ఇన్సూరెన్స్ నిలుస్తుందని ఇన్సూరెన్స్ ఉన్న వాహనదారుడు ఇతరులకు ఢీకొనగా ఇన్సూరెన్స్ సహాయంగా ఉంటుందని వాహనదారుడు ఇన్సూరెన్స్ తప్పకుండా కట్టుకోవాలని చెప్పారు.



## రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, ఏప్రిల్ 16, (ప్రజా కలం)

ఢిల్లీలో రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డి ని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మత్స్య సహకార ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి అత్యంత ఆప్తులుగా, వారి వెన్నంటి ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన నరేందర్ రెడ్డి కి ఈ సముచిత గౌరవం దక్కడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. నరేందర్ రెడ్డి మీద నమ్మకంతో ఈ గొప్ప అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై గళాన్ని వినిపించడంలో నరేందర్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తారని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు కూడా పాల్గొన్నారు.



## ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

### -టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి.

### - అర్హులైన ప్రతి లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు.... జిల్లా కలెక్టర్ ప్రావీణ్య.

సంగారెడ్డి ప్రతినిధి
ఏప్రిల్ 16( ప్రజా కలం):

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం కంది మండలంలోని రైతు వేదికలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్‌బుక్కులు, సన్నబియ్యం పంపిణీ, వైద్య సేవలు తదితర పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రజలకు తెలియజేశారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం



విస్తరణ వంటి నూతన పథకాలపై అవగాహన కల్పించారు. కొందరు లబ్ధిదారులు తమకు అందిన ప్రయోజనాలను వెల్లడిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి కుటుంబానికి చేరేలా అవగాహన కల్పిస్తున్నా మన్నారు. రైతులకు రైతు భరోసాతో పాటు వ్యవసాయ యంత్రాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, మార్చి 6 నుంచి ప్రభుత్వం 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నదన్నారు. ఇప్పటికే శానిటేషన్, ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించామని, ఏప్రిల్ 2న గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ వారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రతి గ్రామంలో పోలీస్ శాఖతో కలిసి రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సర్పంచులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడటం సర్పంచుల బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లాలో సివిల్ సప్లై స్ ద్వారా మూడు నెలల రేషన్ పంపిణీ జరుగుతోందని, ఇప్పటికే 80 శాతం ఇవ్వడం జరిగిందని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలను పెంచి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, అందుకు సర్పంచులు, ఎస్ హెచ్ జి మహిళలు సహకరించాలని కోరారు. ఈజీఎస్ కింద చేపట్టిన పాఠశాలల్లో మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్, గ్రామపంచాయతీ, అంగన్వాడి కొత్త భవనాల పనులు వచ్చే రెండు నెలల్లో పూర్తి చేసేలా ఆయా సర్పంచులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐసి జిఎం తుల్జా నాయక్ , ఎంపీడీవో శ్రీనివాస్ , తహసిల్దార్ రవికుమార్ ,ఎంపీఓ మహేందర్ రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, మండల సమాఖ్య ప్రతినిధులు, మహిళలు, రైతులు, మండల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## చెక్ డాం వద్ద కాంగ్రెస్ నాయకులు గంగమ్మ తల్లికి ఘనంగా పూజలు

మెదక్ ఏప్రిల్ 16(ప్రజాకలం ప్రతినిధి ) మెదక్ జిల్లా కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పైతర చెక్ డాం వద్ద కాంగ్రెస్ నాయకులు గంగమ్మ తల్లికి కొబ్బరికాయలు కొట్టి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగులగారు మల్లేశం



గౌడ్ మాట్లాడుతూ చివరి దశ ఉన్న పంటలను దృష్టిలో పెట్టుకొని వాటిని కాపాడ్డానికి శ్రమించి నీళ్లు విడుదల చేయడానికి కృషిచేసిన నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధిత శాఖ ఉత్తంకుమార్ రెడ్డికి జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి,ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారులు నరేందర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కొల్చారం మండల మాజీ వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏల్లుగారు శ్రీనివాస్ రెడ్డి, రంగంపేట మాజీ సర్పంచ్ బండి సుజాత రమేష్, తుక్కాపూర్ మాజీ సర్పంచ్ శివప్పగారి మాధవి శ్రీశైలం, పైతర గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమేష్, మండల బీసీ సెల్ అధ్యక్షులు బండి మల్లేశం, రంగంపేట గ్రామ శాఖ అధ్యక్షులు గొండ కృష్ణ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అల్లి చందు, ఉపాధ్యక్షులు చిలక ప్రభాకర్, సీనియర్ నాయకులు యాదవ రెడ్డి, పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ దుర్గేష్ గౌడ్, సంగాయపేట గ్రామ శాఖ అధ్యక్షులు ఆగంగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ రామకృష్ణయ్య, ఉపేందర్ గౌడ్, రంగంపేట పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ ఏర్పుల రమేష్, మాజీ మండలం మైనారిటీ అధ్యక్షులు ఎండి గౌస్ పాషా, ఎమ్మార్పీఎస్ నాయకులు దుర్గయ్య, పైతర కాంగ్రెస్ పార్టీ నాయకులు సీనియర్ నాయకులు మిద్దె లక్ష్మీనారాయణ గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు.ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నోయిడా పారిశ్రామిక కార్మికులు చేస్తున్న పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు

### -కార్మికుల హక్కులను కాలరాస్తే తిరుగుబాటు తప్పదు

### -సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్

### -నోయిడా కార్మికులపై నిర్బంధాన్ని నిరసిస్తూ పాశమైలారం వాడలో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ

సంగారెడ్డి ప్రతినిధి
ఏప్రిల్ 16( ప్రజా కలం):

దేశ రాజధాని ఢిల్లీ నగరం చుట్టూత నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్ సి ఆర్) ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడా లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు కనీస వేతనాలు చెల్లించాలని, పనిగంటలు తగ్గించాలని, ఇతర చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న పోరాటంపై పరిశ్రమల యాజమా న్యాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న నిర్బంధాన్ని ఆపాలని సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నాడు పాశమైలారం పారిశ్రామిక వాడలో సిఐటియు ఇండస్ట్రియల్ క్లస్టర్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరిగిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె అనంతరం నేషనల్ క్యాపిటల్ రీజియన్ నోయిడా గ్రేటర్ నోయిడా గురుగావ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు 8000/-, 9000/- తక్కువ వేతనాలతో ఇస్తూ, రోజుకు 12-13



గంటలు పని చేయిస్తూ తీవ్ర శ్రమ దోపిడికి యాజమాన్యాలు పాల్పడుతున్నాయని అన్నారు చట్ట ప్రకారం అమలు చేయాల్సిన సౌకర్యాలను కూడా అమలు చేయకపోవడంతో కార్మి కులు చేస్తున్న సమ్మెను పరిష్కరిం చకపోగా వారిని అనేక రకాలుగా చిత్రహింసలు పెడుతూ సమ్మెను అణిచి వేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. పోరాటంలో ఉన్న కార్మికులపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేస్తూ జైల్లో సుమారు 400 మందిని నిర్బంధించారని అన్నారు. యాజమాన్యాలు చేస్తున్న నిర్బంధాన్ని ఖండించకుండా కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమ అధిపతులకు అనుకూలంగా వ్యవహరిస్తూ అధికార యంత్రాంగం యాజ మాన్యాలకు దాసో హం చేయడం సిగ్గుచేటని అన్నా రు. మార్కెట్ లో పెరిగిన ధరలకు అను గుణంగా కార్మికులకు కనీస వేతనం 26 వేలుగా నిర్ణయించాలని దేశంలోని అన్ని కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున సమ్మెలాంటి పోరాటాలు చేసినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అదే విధంగా ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, హర్యానా లాంటి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర ప్రభుత్వం ఆజ్ఞను శిరసా వహిస్తూ ప్రస్తుతం ఉన్న కనీస వేతనాలను కూడా అమలు చేయిం చకుండా కార్పొరేట్ శక్తులకు అనుకూ లంగా ఉంటూ కార్మికుల పట్ల కర్కషంగా వ్యవహరిస్తున్న విధానాలను భారత కార్మిక వర్గం తీవ్రంగా ఖండించాలని ఆయన అన్నారు. భేషరతుగా జైల్లో ఉన్న కార్మికులందరినీ విడుదల చేయాలని, అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని, కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే పోరాటం మరో రూ పంలోకి వెళుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిర్బి యూనియన్ జనరల్ సెక్రెటరీ వి.ఎస్ రాజు నాయకులు సుధాకర్ లఖన్ మల్లేశం విట్టల్ జైపాల్ మహేశ్వర్ రెడ్డి పిల్లి శ్యామ్ నాగప్రసాద్ పెద్ద ఎత్తున కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## వేం నరేందర్ రెడ్డికి అభినందనలు తెలిపిన జిల్లా నాయకులు

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 16:

గురువారం రాజ్య సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడ్డిని డిల్లీ లోని తెలంగాణ భవన్ లో కలిసి అభినందనలు తెలియజేసిన జిల్లా కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి,ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్,రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి,రాష్ట్ర మైనారల్ డెవలప్మెంట్ చైర్మన్ ఈరావత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,ఆర్మూర్ ఇంచార్జి వినయ్ రెడ్డి,మునిపల్లి సాయిరెడ్డి,బాసా వేణు, గోపాల్ యాదవ్ కలిశారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'పై కమ్మర్ పల్లి లో సమీక్షా సమావేశం



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 16:

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి 99 రోజుల ప్రణాళికలో భాగంగా మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ,ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక పథకాలపై విస్తృత స్థాయిలో ప్రజలకు సమాచారం అందించామని. ప్రజా పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, స్థానిక సమస్యలను గుర్తించడం, అభివృద్ధి ప్రాధాన్యతలను నిర్ధారించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలోని ఆయా గ్రామాలలో ఆయా శాఖల అధికారులు,నిర్వహించిన కార్యక్రమాల గురించి, మరియు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి,గృహ జ్యోతి, సన్నారకం వరి బోనస్, పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్,మహిళా శక్తి బ్యాంక్ లింకేజ్,కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ చీరలు,వడ్డీ లేని రుణాలు వంటి పథకాలపై సవివరంగా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాలు ప్రజలకు సులభంగా అందుబాటులోకి ప్రభుత్వం తీసుకువచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య,వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంకెట రవి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజా గంగారం,ఎంపీడీవో రాజా శ్రీనివాస్, వ్యవసాయ అధికారి రమ్యశ్రీ, మండల విద్యాధికారి నేర ఆంధ్రయ్య,మండల వైద్యాధికారులు, వైద్యసిబ్బంది,విద్యుత్ అధికారులు,ఎస్సై జి.అనిల్ రెడ్డి పోలీస్ సిబ్బంది,ఐకెపి ఎపిఎం కిరణ్ కుమార్,ఐకెపి సిబ్బంది,అంగన్వాడీ సిబ్బంది,ఆశ వర్కర్ సిబ్బంది,ఆయా గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు, వాడు సభ్యులు,తదితర ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కుల గణన సర్వే దేశానికి ఆదర్శం

**- సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగించే ప్రయత్నం**
**-భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యత**
**-మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం**

మహేశ్వరం, ఏప్రిల్ 16,(ప్రజా కలం)



తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక, ఆర్థిక, కుటుంబ సర్వేపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు భవిష్యత్ లో రాజకీయ అవకాశాలు పెరుగుతాయని కేఎల్ఆర్ అన్నారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం చేసిన సర్వేను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా చేపట్టాలని కోరారు. నిపుణుల కమిటీ చేసిన చేసిన సర్వే వివరాలు ప్రభుత్వ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచామని లక్ష్మారెడ్డి అన్నారు. అత్యధికంగా ఉన్న కులాలకు సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ఎక్కువ సీట్లు ఇస్తామని... ఇప్పటికే బలహీన వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కిచ్చెన్నగారు తెలిపారు. వెనకబాటుతనాన్ని తగ్గించేందుకు అన్ని పార్టీలు కృషి చేయాలని కేఎల్ఆర్ కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరం లో డిగ్రీ ప్రవేశాల దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్

**కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ సంగి రమేశ్**

**మహేశ్వరం, ఏప్రిల్ 16, (ప్రజా కలం)**



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరంలో డిగ్రీ బి.ఎ.(60 సీట్లు),బి.కాం.(60 సీట్లు), బిఎస్సి లైఫ్ సైన్స్(60 సీట్లు), బిఎస్సి ఫిజికల్ సైన్స్(60 సీట్లు) కోర్సులలో ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం దోస్త్ దరఖాస్తు ప్రక్రియ ప్రకటన వెలువడినది. డిగ్రీలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు మొదటి ఫేజ్ రిజిస్ట్రేషన్ ఈ నెల 15 నుండి మే 7 వరకు, వెబ్ ఆప్షన్ ఈనెల 30 నుండి వచ్చే నెల 8 వరకు చేసుకో వచ్చు అన్నారు. దీనికై ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరంలోని దోస్త్ హెల్ప్ లైన్ రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని అలాగే సుదూర ప్రాంతాలలోని కళాశాలలో చేరకుండా స్థానికంగా అందుబాటులో ఉండి, అపార అనుభవం ఉన్న అధ్యాపకులు, విశాలమైన తరగతి గదులు, ఎన్ఎస్ఎస్ వంటి సకల సదుపాయాలు కలిగిన మహేశ్వరం డిగ్రీ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి విద్యార్థులు అడ్మిషన్ తీసుకొని చేరాలని కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ సంగి రమేశ్ కోరారు.

దోస్త్ అడ్మిషన్స్ కొరకు తీసుకురావలసినవి

1. దోస్త్ డిగ్రీ అడ్మిషన్స్ కోసం రూ.500 ఫీజు చెల్లించి క్రింద తెలియచేసిన సర్టిఫికెట్లతో
(అన్ని ఒరిజినల్స్ & జిరాక్స్ సెట్)
2. టి.సి
3. ఇంటర్ మెమో
4. ఎస్ఎస్సి మెమో5. బోనఫైడ్ సర్టిఫికెట్స్
6. ఇన్కమ్ సర్టిఫికెట్
7. Caste certificate
8. ఆధార్ కార్డు
9.పాసుపోర్ట్ ంఱఓవ కలర్ ఫొటోస్ (2)

దోస్త్ డిగ్రీ అడ్మిషన్స్ కోసం 9440447737, 9908078786 9963941311, 98663472 నెంబర్లను సంప్రదించగలరు.

## బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని దేశ విభజనతో పోల్చడం క్షమించరాని నేరం



**- తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ,**
**తెలంగాణ సాధనలో అమరుల త్యాగాలను అవమానించేలా బీజేపీ ఎంపీ వ్యాఖ్యలు**
**- ఎంపీ తేజస్వీ సూర్యపై వెంటనే చర్యలు తీసుకుని పార్లమెంట్ నుండి సస్పెండ్ చేయాలి.**
**- సభలో తెలంగాణ నుండి 8 బీజేపీ, 8 కాంగ్రెస్ ఎంపీలు దిష్టిబొమ్మల్ల మిగిలారు**
**- సభలో బీఆర్ఎస్ ఎంపీలు ఉండి ఉంటే బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యకు తగిన గుణపాఠం చెప్పేవారు**
**- తెలంగాణ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఈ వాఖ్యలపై సమాధానం చెప్పాలి.**
**- బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలి.**
**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఏప్రిల్ 16:

తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ వ్యాఖ్యలు పూర్తిగా అవివేకపూరితమైనవని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా చట్టాలకు లోబడి పార్లమెంట్ ప్రక్రియ ద్వారా ఒక రాష్ట్రం ఏర్పడటాన్ని దేశ విభజనతో ముడిపెట్టి శత్రుదేశమైన పాకిస్థాన్ తో పోల్చడం క్షమించరాని నేరమని, ఇది దేశద్రోహానికి సమానమని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన దీర్ఘకాల పోరాటం, వేలాది అమరుల త్యాగాలను అవమానించేలా బీజేపీ ఎంపీ తేజస్వి వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేసిన ఎంపీపై వెంటనే చర్యలు తీసుకుని పార్లమెంట్ నుండి సస్పెండ్ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తేజస్వీ సూర్యను కోరారు.

రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుండటాన్ని బీజేపీ తట్టుకోలేకపోతోందని, బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య అహంకారపూరిత వ్యాఖ్యలే దీనికి నిదర్శనమని విమర్శించారు.


తెలంగాణ ఏర్పాటును ఇండియా-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అంటే పార్లమెంట్‌ను, 140 కోట్ల దేశ ప్రజలను అవమానపరచడమేనని అన్నారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు అదే తరహాలో ఉంటే, విభజన బిల్లుకు అప్పట్లో బీజేపీ ఎందుకు మద్దతు తెలిపిందని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా గతంలో తెలంగాణ ఏర్పాటు ప్రక్రియపై అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. నాడు మోడీ అయినా, నేడు తేజస్వి సూర్య అయినా తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచారని అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అవమానకరంగా మాట్లాడుతుంటే అదే పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న తెలంగాణకు చెందిన 8 బీజేపీ, 8 కాంగ్రెస్ ఎంపీలు మౌనం వహించడం సిగ్గుచేటు . తెలంగాణలో గెలిచిన ప్రజాప్రతినిధులు ఢిల్లీలో రాష్ట్ర గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత వారిపై ఉందని గుర్తుచేశారు.

తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా సభలో తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు దిష్టి బొమ్మల్లా మిగిలారు. తెలంగాణ నుండి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి, సహాయ మంత్రి బండి సంజయ్ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి అన్నారు. ఒకవేళ అదే సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉంటే బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య సంగతి ఏమిటో తేల్చేవారు, పార్లమెంట్ ను స్థంబింపజేసి వారికీ తగిన సమాధానం ఇచ్చేవారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే తెలంగాణ ప్రజలకు, పార్లమెంట్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా ప్రజలు సహించరని, బీజేపీ నేతలు కొరవి తో తలగోక్కోవద్దని తీవ్రంగా హెచ్చరించారు.తెలంగాణ ఏర్పాటు పై బీజేపీ వైఖరిని తెలంగాణ ప్రజలు గమనించాలని కోరారు.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మహేశ్వరం, ఏప్రిల్ 16,(ప్రజా కలం) మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని జల్పల్లి సర్కిల్ ప్రీమియర్ ఫంక్షన్ హాల్ లో 360 లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గము శాసనసభ్యురాలు బిఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సబితా ఇంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో చెక్కులు తీసుకున్న ప్రతి లబ్ధిదారులు తులం బంగారం గురించి హామీలు గురించి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి పేదల ఇళ్ళు ను కూల్చటమే ప్రథమ కర్తవ్యం గా పాలన సాగిస్తూ ప్రత్యేకంగా మహిళలకు ఇచ్చిన హామీల్లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు "తులం బంగారం" హామీ ఇప్పటికీ అమలు కాలేదని, రెండున్నర సంవత్సరాలు గడిచినా ఒక్క మహిళకైనా ఆ హామీ అందలేదని అన్నారు. అదేవిధంగా నిరుపేదలకు ఇల్లు లేని వారికి డబుల్ బెడ్ రూమ్ లు కేటాయించకుండా కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు కేటాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు,.. కెసిఆర్ పాలనలో కట్టిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో పారదర్శకత పాటించాలని ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి కేటాయించాలని కోరారు. అదేవిధంగా నీటి సమస్య తీవ్రంగా ఉందని కెసిఆర్ పాలనలో మహిళలు బిందెలతో బయటకు పోకుండా మిషన్ భగీరథ పథకాన్ని తెచ్చి ఇంటింటికి నల్ల ఇచ్చిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని దాన్ని తూట్లు పొడుస్తూ వారానికి ఒక్కసారి కూడా మంచినీటిని వదలడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నీటి సమస్యలను తీర్చాలని వేసవిలో ప్రజలకు నీటి ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలని మంచినీటిని మిషన్ భగీరథ నీళ్లు రోజు వదలాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఇందిరా దేవి, మండల అధికారులు జల్పల్లి సర్కిల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ వెంకట్రాము, అధికారులు మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.




**తేజస్వీ సూర్య వ్యాఖ్యలు తెలంగాణ అస్తిత్వానికే అవమానం**

## బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి డిమాండ్**

మహేశ్వరం, ఏప్రిల్ 16,(ప్రజా కలం)



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, నాలుగు కోట్ల ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచేలా ఉన్నాయని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం విలేఖరులతో మాట్లాడిన ఆయన, ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.?తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనేది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, దేశ అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంటులో పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా జరిగిన ప్రక్రియ. దీనిని మత ప్రాతిపదికన, తీవ్ర రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం తేజస్వీ సూర్య చారిత్రక అజ్ఞానానికే కాక, భారత రాజ్యాంగాన్ని అవమానించడమే అవుతుంది" అని పాండురంగారెడ్డి మండిపడ్డారు.?త్యాగాల గడ్డపై చులకన భావం ?దశాబ్దాల పాటు విద్యార్థులు, యువకులు, రైతులు తమ ప్రాణాలను, భవిష్యత్తును పణంగా పెట్టి సాగించిన మహోన్నత పోరాట ఫలితం నేటి తెలంగాణ అని ఆయన గుర్తు చేశారు. "ఉద్యమకారుల త్యాగాలను, ప్రజల ఆకాంక్షలను చులకన చేస్తూ మాట్లాడటం ఒక పార్లమెంట్ సభ్యుడి బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ప్రాంతీయ ఆకాంక్షలను గుర్తించడం భారత సమాఖ్య స్ఫూర్తిలో భాగం, కానీ దానిని అపహాస్యం చేయడం గర్హనీయం" అని పేర్కొన్నారు.

తెలంగాణ జాగృతి హెచ్చరిక తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవితమ్మ ఇప్పటికే ఈ అంశంపై స్పందిస్తూ, తెలంగాణ నుండి ఎన్నికైన బీజేపీ ఎంపీలు ఈ విషయంలో మౌనం వీడాలని, తేజస్వీ సూర్యతో వెంటనే క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేసిన విషయాన్ని పాండురంగారెడ్డి గుర్తు చేశారు. ఉద్యమకారుల ఆత్మగౌరవంతో ఆడుకుంటే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు.?తెలంగాణ సమాజానికి, ఉద్యమకారులకు తేజస్వీ సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి. ?పార్లమెంట్ గౌరవాన్ని తగ్గించేలా చేసిన ఈ వ్యాఖ్యలను తక్షణమే పార్లమెంట్ రికార్డుల నుండి తొలగించాలి.?తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన బీజేపీ ఎంపీలు తమ పార్టీ సహచరుడి వ్యాఖ్యలను ఖండించి, రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలబడాలి. ?తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసే ఏ శక్తినైనా ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటామని కప్పాటి పాండురంగారెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

भारत की जनगणना 2027 CENSUS OF INDIA जनगणना से जन कल्याण

गृह मंत्रालय भारत सरकार सत्यमेव जयते

# OUR CENSUS OUR DEVELOPMENT

(First Phase of Census 2027)

Common queries on Self-Enumeration (SE) and their Answers (Part-1)

## WHAT IS SELF-ENUMERATION?

Self-Enumeration is an online process in which you fill and submit your household details on the SE portal **(se.census.gov.in)** yourself, without waiting for an enumerator



- **Is Self-Enumeration mandatory?**
  No, it is an additional facility. If you do not do it, an enumerator will collect data during field visit
- **Can I do Self-Enumeration in any language?**
  This facility is available in Hindi, English and 14 Indian languages
- **Is internet required for Self-Enumeration?**
  Yes, internet is required to access the portal
- **Is my information safe?**
  Yes, all data is secure, encrypted and stored on government servers
- **What is SE ID and its use?**
  After submission of information, you will receive a unique 11 digit SE ID (Also via SMS/email) which must be shown to the enumerator during her/his visit to your house
- **What if SE ID is forgotten?**
  It can be retrieved using the registered mobile number on the portal
- **Will an enumerator visit after Self-Enumeration?**
  Yes, the enumerator will visit your home and confirm your details using the SE ID
- **Do I need to upload any documents?**
  No documents are required to be uploaded
- **Is help available on the portal?**
  Portal has user guide, flowcharts, tutorial videos, FAQs and tooltips

TOLL FREE - 1855

CBC 19108/13/0018/2627

**Let us fulfill our responsibility, Let us participate in the Census** CensusIndia2027


Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com